మనసులో మాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా బర్త్‌లిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
చిత్తూరు | అన్నమయ్య | అనంతపురం
కర్నూలు | కడప | నెల్లూరు
శనివారం 28 సెప్టెంబర్ 2026 పేజీలు 16



రెండో దశ పంచాయతీ
ఎన్నికల ప్రచారం ముగింపు

- 48 గంటల పాటు ప్రచారంపై నిషేధం
- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- – జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు, ప్రతినిధి, నవంబర్ 27, మనసులో మాట:
జిల్లాలో ఈ నెల 29న జరగనున్న రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ముగిసిందని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల పాటు ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆత్మకూరు, గూడూరు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలోని 14 మండలాలు, 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో 97 రూట్లలో ఉన్న 214 గ్రామ పంచాయతీలకు రెండో దశలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో బహిరంగ సభలు, ర్యాలీలు, ..మిగతా 10లో



కూటమి పాలనలో ఎన్నికల్లో అక్రమాలు
రీ పోలింగ్ జరపాలి: రవీంద్రనాథ్ రెడ్డి



ఎన్నో ఏళ్ల లో వోల్టేజ్ కష్టాలకు విద్యుత్ శాఖ చెక్!

- ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త 11 కేవీ లైన్.. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి చొరవ చూపిన విద్యుత్ అధికారులు.. కళాశాల వర్గాల హర్షం

ముదిగుబ్బ, నవంబర్ 27: (మనసులో మాట)
సమస్యను గుర్తించడం, పరిష్కారానికి చొరవ చూపడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ శాఖల



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

- 21వ డివిజన్ అభివృద్ధిపై అడిషనల్ కమిషనర్ హిమబిందు సమీక్ష
- ప్రజల మధ్యకు కార్పొరేటర్ విజయలక్ష్మి



బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును దెబ్బతీస్తాయి

గ్రామ గ్రామాన అభివృద్ధే లక్ష్యం

- – మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- ఆత్మకూరు నియోజకవర్గంలో 135 గ్రామ పంచాయతీలకు గాను 52 పంచాయతీలు ఏకగ్రీవం
- ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మంత్రి అభినందనలు



మనసులో మాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రేణిగుంట మండలంలో చక్రం తిప్పిన డాలర్స్ దివాకర్ రెడ్డి



- టిడిపి జెండా అజెండాగా మండలంలో డాలర్స్ హవ
- మండలంలో టిడిపిదే పైచేయి

తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

రేణిగుంట మండలంలో డాలర్స్ దివాకర్ రెడ్డి అనుచరులు విజయపరపర కొనసాగుతోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అనుచరులు తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయ డంకా మోగించారు. డాలర్స్ దివాకర్ రెడ్డి మీద ఉన్న ప్రేమ అభిమానాలతో వైకాపా ప్రాబల్యం ఉన్న స్థానాల్లో కూడా విజయ బేరి మోగించింది. మండలాల్లో వెంకటాపురం పంచాయతీ తండ్ల,గాజుల మాండ్యం,తండ్లం, విప్పమానుపట్టెడ, కరకంబాడి, రేణిగుంట మేజర్ పంచాయతీల్లో డాలర్స్ దివాకర్ రెడ్డి చక్రం తిప్పడంతో ఏకపక్షంగా ఎన్నికల సాగాయి. డాలర్స్ దివాకర్ రెడ్డి హవాతో రేణిగుంట మండలంలో గ్రామపంచాయతీ స్థానాలను ఏకపక్షంగా సాధించుకున్నాయి. రేణిగుంట మండల ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి,కి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా దాస శ్రేష్ట భక్త కనకదాసు జయంతి



తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

శ్రీ దాస శ్రేష్ట భక్త కనకదాసు 539వ జయంతిని తిరుపతి జిల్లా కురువ,కురుబ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కనక దాసు విగ్రహానికి, పుష్పాలంకరణ చేసి, ఘజమాలతో ఘనంగా నివాళులర్పించారు. బీసీ వెల్ఫేర్ మంత్రి సవితమ్మ సహాయ సహకారాలతో విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించుటకు కూటమి ప్రభుత్వం శాశ్వత జీవో ప్రకటించిందని,కూటమి ప్రభుత్వానికి కురుబ సంఘం కుటుంబ సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.కనకదాసు జయంతిని ప్రభుత్వమే నిర్వహించాల్సిన కార్యక్రమమని,ఎన్నికల నియమావళి కారణంగా సంఘం ఆధ్వర్యంలో నిడారంభరంగా నిర్వహించామని తిరుపతి జిల్లా కురువ,కురుబ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మంగిరి రెడ్డప్ప అన్నారు.ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు జీ పోతప్ప,చెర్లోపల్లి మల్లయ్య,మద్దిగిని నాగ సుబ్బయ్య,చింతల విశ్వనాథ్,ఆవుల రవీంద్ర, చామంచుల రమణ, గుండ్లూరు శ్రీనివాసులు, దుర్గం పోతయ్య,బెళ్లాల నాగేశ్వర్,కామిని రామాంజనేయులు, ఎల్ఐసి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల టీడీపీలో భూమా బ్రహ్మానందరెడ్డి హవా..

- ..గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల క్యూ..
- మాజీ ఎమ్మెల్యేతో సర్పంచులు,వార్డు మెంబర్ల మర్యాదపూర్వక భేటీ..



రాయలసీమ బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట):

నంద్యాల నియోజకవర్గ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి నాయకుల సందడి ఆసక్తికరంగా మారింది. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు,నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. నంద్యాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామ టీడీపీ సర్పంచ్ అన్నపురెడ్డి సురేందర్ రెడ్డి,గోస్పాడు మండలం చింతమట్ల గ్రామ టీడీపీ సర్పంచ్ పరమేశ్వర్ రెడ్డి,జూలెపల్లి గ్రామ సర్పంచ్‌తో పాటు పలువురు వార్డు మెంబర్లు,టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని కలిసి తమ అభిమానం,గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆత్మీయంగా పలకరించిన నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ,ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతే లక్ష్యం నంద్యాల నియోజకవర్గంలో టీడీపీకి గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు,కార్యకర్తలే వెన్నెముకగా నిలుస్తున్నారు. సర్పంచులు,వార్డు మెంబర్లు,స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యేతో సమావేశం కావడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రజాప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ,కార్యకర్తలకు అండగా నిలవడం ద్వారా పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తానికి ఈ భేటీ కేవలం మర్యాదపూర్వక కలయికకే పరిమితం కాకుండా నంద్యాల నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య ఐక్యత,సమన్వయానికి అద్దం పట్టిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

కూటమి పాలనలో ఎన్నికల్లో అక్రమాలు రీ పోలింగ్ జరపాలి: రవీంద్రనాథ్ రెడ్డి



కడప, మనసులో మాట నవంబర్ 27:

రాజ్యాంగ దినోత్సవం రోజున జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. కడపలో మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమాలు జరిగాయని, ప్రజాప్రతినిధుల ఆదేశాలతోనే స్క్రూట్నీలో నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. 30 నెలల కూటమి పాలన విఫలమైందని, హామీలు, అభివృద్ధి లేదని, అప్పులు రూ. 4 లక్షల కోట్లు దాటాయని విమర్శించారు. జిల్లాలో 176 పంచాయతీలకు నోటిఫికేషన్ ఇస్తే 71 చోట్ల బలవంతపు ఏకగ్రీవాలు చేశారని, హౌస్ అరెస్టులు, ఏజెంట్ల తొలగింపు, రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు.అడ్డంకులు ఎదురైనా జిల్లాలో 63, రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 1,200 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ గెలిచిందని తెలిపారు. అక్రమాలు జరిగిన చోట రీ పోలింగ్ జరపాలని, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు ఈ మీడియా సమావేశంలో నగర మహిళా అధ్యక్షురాలు బండి దీప్తి రెడ్డి. పులి సునీల్ కుమార్. ఫయాజ్ .వెంకటేశ్వర్లు వినోద్. ముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్నెముతేరి వైఎస్ఆర్సీపీ సర్పంచ్ అభ్యర్థిగా కుదిరి శోభ..

- అల్లూరి అనిల్ రెడ్డి ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి..
- మంచం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థన
- గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేస్తున్న కుదిరి శోభ ప్రభాకర్ దంపతులు



సూళ్లూరుపేట నవంబర్ 27 (మనసులో మాట):

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం మన్నేముత్తేరి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కుదిరి శోభ నిలిచారు. అల్లూరి అనిల్ రెడ్డి ఆశీస్సులతో, పార్టీ మద్దతుతో గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ఆమె ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు. గ్రామంలోని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేయాలనే సంకల్పంతో కుదిరి శోభ ప్రభాకర్ దంపతులు ప్రజల ముందుకు వస్తున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుధ్యం, వీధి దీపాలు, రహదారుల అభివృద్ధి వంటి ప్రజలకు అవసరమైన అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొంటున్నారు.ఈ సందర్భంగా కుదిరి శోభ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆశీస్సులు, ఆదరణతో సర్పంచ్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని, తనపై నమ్మకం ఉంచి ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కావున మన్నేముత్తేరి గ్రామపంచాయతీ ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకొని, మంచం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించి ఆశీర్వదించాలని కుదిరి శోభ వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

టెలికామ్ వినియోగదారులకు అత్యున్నతమైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యం:- డాక్టర్ బత్తుల సంజీవరాయుడు, ట్రాయ్ కాగ్ సభ్యులు



పులివెందుల, మనసులో మాట

నవంబర్ 27:

టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు తెలిపారు. పులివెందుల పట్టణంలోని, లయోలా పాలిటెక్నిక్ కాలేజ్ కళాశాలలో టెలికం వినియోగదారుల అవగాహన సదస్సు పిఎస్ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ సెక్రటరీ ఆధ్వర్యంలో పులివెందుల పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాయ్ కాగ్ మెంబర్‌డాక్టర్ బత్తుల సంజీవరాయుడు మాట్లాడుతూ టెలికామ్ నియంత్రణ ప్రాధికార సంస్థ ట్రాయ్ ప్రధాన బాధ్యతల్లో సెల్ వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం ఒకటి అన్నారు. మెరుగైన టెలికామ్ సేవలు అందించడం కోసం సెల్ కంపెనీలు అయిన జియో, ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్, వోడాఫోన్ మొదలగు కంపెనీల సేవలపై నిబంధనలు, ఆదేశాలు, పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉత్తర్వులను జారీ చేస్తుందని పేర్కొన్నారు. టెలికామ్ రంగంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణల ద్వారా 110 కోట్ల మంది వినియోగదారులు మనదేశంలో మెరుగైన సేవలు ట్రాయ్ ద్వారా పొందుతున్నారన్నారు. వివిధ టెలికామ్ సేవలు మరియు కేబుల్ టీవీ సేవలు నాణ్యతా ప్రమాణాలను సమర్థవంతంగా రూపొందించి వాటిని పటిష్టంగా అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ అనే స్వతంత్ర నియంత్రణ సంస్థను రూపకల్పన చేసి అమలులోకి తెచ్చిందని చెప్పారు. అంతేకాక ట్రాయ్ నిబంధనల ప్రకారము, టారిఫ్ సిస్టం, వ్యాపార ప్రకటనల నిశిద్ధం, సేవల నాణ్యత ప్రమాణాలు, మొబైల్ నంబర్ పోర్టబుల్టి, సౌకర్యం విలువతో కూడిన సేవలు, రక్షణ, వినియోగదారుల హక్కులు మరియు మొబైల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ ఆవిర్భావ ఆశయం అన్నారు. ప్రస్తుత తారీఫ్ ఇతర కంపెనీల కంటే తక్కువగా బిఎస్ఎన్ఎల్ ఉండడమే కాక, బిఎస్ఎన్ఎల్ లో కూడా 4జీ సేవలు రావడం ద్వారా వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో మార్టిన్ పాల్ , రమణ , సుబ్బయ్య ప్రకాశం తదితరులు , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల రహిత సమాజమే లక్ష్యం.. చిత్తూరులో రియల్ ఎన్.జి.ఓ ఆధ్వర్యంలో భారీ అవగాహన ఉద్యమం



చిత్తూరు, మనసులో మాట

నవంబర్ 27:

2030 నాటికి భారతదేశాన్ని బాల్యవివాహాల రహిత దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చిత్తూరు జిల్లాలో రూరల్ ఎడ్యుకేషన్ అండ్ లిబర్టీ (రియల్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తొలి అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా వెయ్యి అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో బాల్యవివాహాల నుంచి రక్షించబడిన బాలికలు, వాటిని అడ్డుకోవడంలో కీలకపాత్ర పోషించిన మహిళలు, మహిళా నాయకులు, మతపెద్దలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. తమ బాల్యవివాహాలను ధైర్యంగా అడ్డుకున్న బాలికలు తమ అనుభవాలను వివరించగా, వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సుమారు వెయ్యి మంది పాల్గొని బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. వివాహ వేడుకలతో సంబంధం ఉన్న పురోహితులు, మౌల్వీలు, వంటవారు, డెకరేటర్లు, బ్యాండ్ నిర్వాహకులు, టెంట్ సర్వీస్ నిర్వాహకులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు సైతం బాల్యవివాహాలకు సహకరించబోమని, సమాచారం తెలిస్తే అధికారులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రియల్ సంస్థ సీఈఓ, డైరెక్టర్ ఎస్. రామారావు మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ప్రభుత్వంతో పాటు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జే.ఆర్.సి) సంస్థ సహకారంతో బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. 2024-25 సంవత్సరంలో చిత్తూరు జిల్లాలో 419 బాల్యవివాహాలను అడ్డుకున్నామని తెలిపారు. ప్రతి బాలికకు విద్య, స్వేచ్ఛ, భవిష్యత్తును ఎంచుకునే హక్కు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. జే.ఆర్.సి జాతీయ సమన్వయకర్త రవికాంత్ మాట్లాడుతూ.. నవంబర్ 27ను అంతర్జాతీయ బాల్యవివాహాల నిర్మూలన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించడం భారతదేశానికి గర్వకారణమన్నారు. దేశవ్యాప్తంగా జే.ఆర్.సి నెట్‌వర్క్‌లోని 300కు పైగా సంస్థలు 782 జిల్లాల్లో పనిచేస్తూ మూడేళ్లలో 6.5 లక్షలకు పైగా బాల్యవివాహాలను అడ్డుకోవడంలో సహకరించాయని వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సివిల్ జడ్జి భారతి, రియల్ సీఈఓ ఎస్. రామారావు, డీసీపీఓ సుబ్రహ్మణ్యం, కె. శ్యామ సుగుణ కుమారి, జీవనజ్యోతి ప్రిన్సిపాల్, పీవీకెన్ కళాశాల, హెచ్ఓడీ రాజేష్, ఐ.సి.డి.ఎస్ నిర్మల, సి.డబ్ల్యూ.సి సభ్యుడు సురేష్ బాబు, మెప్మా జయంతి, డి.ఎం.& హెచ్.ఓ డాక్టర్ గౌరీ శంకర్, రియల్ -జే.ఆర్.సి ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. హనిషా, సిబ్బంది భువనేశ్వరి, ఖజాబీ, బబిత తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైన లెడ్ రోప్ లైట్ల నిర్మాణం.. 39 వార్డ్ కౌన్సిలర్ కోటిరెడ్డి రాజారెడ్డి



ధర్మవరం నవంబర్ 27

(మనసులో మాట)

పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైన లెడ్రోప్ లైట్లు నిర్మాణానికి 39 వార్డ్ కౌన్సిలర్ కోటి రెడ్డి రాజారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పైన ఉన్న విద్యుత్ పోలుకు లెటర్ లైట్లు తో వెలుగులు నింపి పట్టణానికి మంచి వెలుగులు తెచ్చే విధంగా వారు కృషి చేశారు. దీంతో వార్డు ప్రజలు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పలమనేరులో వృద్ధురాలు దారుణ హత్య..



- **ఎల్బీనగర్‌లో ఒంటరిగా నివసిస్తున్న చెంగమ్మ మృతి..**
- **ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. రంగంలోకి క్లూస్ టీమ్..**
- **హత్యకు కారణాలు, నిందితులపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు..**

పలమనేరు నవంబర్ 27

(మనసులో మాట) :

పట్టణంలోని ఎల్బీనగర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. చెంగమ్మ అనే వృద్ధ మహిళ హత్యకు గురికావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. సమాచారం అందుకున్న పలమనేరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి ఒంటిపై తీవ్ర గాయాలు ఉండటంతో ఆమెను ఎవరో హత్య? చేసి ఉంటారని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై పలమనేరు పోలీస్ స్టేషన్‌లో సీఐ మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.... ఎల్బీనగర్‌లో వృద్ధురాలు హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. చెంగమ్మ ఒంటరిగా నివసిస్తుండగా ముందు రోజు చుట్టుపక్కల వారితో మాట్లాడి ఇంటికి వెళ్లినట్లు సమాచారం ఉందన్నారు. ఆమెకు పరిచయస్తుడైన వ్యక్తి రాత్రి సమయంలో ఇంటి వద్ద ఉన్నట్లు కూడా సమాచారం అందిందని తెలిపారు.అయితే ఆ వ్యక్తే హత్యకు పాల్పడ్డాడా? లేక మరెవరైనా ఈ ఘటనకు పాల్పడ్డారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ రెడ్డివెల్లడించారు. ఘటనా స్థలంలో ఆధారాల సేకరణ కోసం చిత్తూరు నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించినట్లు తెలిపారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని సీఐ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. వృద్ధురాలి హత్యతో ఎల్బీనగర్‌లో నివాసం ఉంటున్న ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. అసలు ఈ దారుణానికి పాల్పడింది ఎవరు? హత్య వెనుక కారణాలు ఏమిటి? అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

రుద్ర నినాదాలతో పులకించిన కపిలేశ్వరాలయం

- **భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన రుద్రయాగం**

తిరుపతి బ్యూరో, నవంబర్ 27

(మనసులో మాట) :

తిరుపతిలోని ప్రసిద్ధ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీ కపిలేశ్వరస్వామివారి హోమం (రుద్రయాగం) శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. వేదమంత్రాల ఘోష, రుద్రజప ధ్వనులతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

నెల రోజుల పాటు జరుగుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా నవంబరు 27 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు 11 రోజుల పాటు ఈ రుద్రయాగం నిర్వహిస్తారు.

యాగశాలలో నిత్య కార్యక్రమాలు

తొలిరోజు ఉదయం యాగశాలలో పూజ, రుద్రజపం, హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పూజ, జపం, హోమం, రుద్రత్రిశతి, బిల్వార్చన, నివేదన, విశేష దీపారాధన, హారతి సమర్పించారు.

గృహస్తులకు అవకాశం

భక్తులు ఈ పవిత్ర యాగంలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందవచ్చు. గృహస్తులు రూ.500/ చెల్లించి టికెట్ కొనుగోలు చేసి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. వీరికి ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో కుమారి దేవి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కడపలో 29న హిందూ కార్తీక వనభోజన మహోత్సవం



కడప, మనసులో మాట
నవంబర్ 27:
చిన్మయ మిషన్-కడప, ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి, హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 29న ఆదివారం మూడవ కార్తీక ఆదివారం సందర్భంగా హిందూ కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. శ్రీ లలితా పంచాయతన దేవాలయం సమీపంలోని చిన్మయ మిషన్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం శ్రీకంఠేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 108 కలశాలతో అభిషేకం, గోమాత పూజ, శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం పీఠాధిపతులు, స్వామీజీల ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయి. మధ్యాహ్నం 12.30 నుంచి 3.30 గంటల వరకు వనభోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. చిన్మయ మిషన్ అధ్యక్షులు స్వామి తురీయానంద సరస్వతీ అధ్యక్షతన జరిగే ఈ వేడుకల్లో పలువురు పీఠాధిపతులు, ఆధ్యాత్మిక ప్రముఖులు పాల్గొననున్నారు. సనాతన హిందూ ధర్మాన్ని అనుసరించే అన్ని కులాల ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ కార్తీక వనభోజన కమిటీ-2026 సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు రామ మహేష్, చింతకుంట పుల్లయ్య, బండారు శివకేశవ, జై శ్రీనివాస్ రెడ్డి ,రాఘవరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు

చిన్నంపల్లి పంచాయతీ పీఠం పాణ్యం కావేరి వశం: 208 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం



రైల్వే కోడూరు నవంబర్ 27
మనసులో మాట:
స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో చిన్నంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పీఠాన్ని పాణ్యం కావేరి కైవసం చేసుకున్నారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సమీప ప్రత్యర్థిపై 208 ఓట్ల భారీ ఆధిక్యంతో ఆమె ఘన విజయం సాధించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా బరిలోకి దిగిన పాణ్యం కావేరిపై స్థానిక ఓటర్లు సంపూర్ణ విశ్వాసం ఉంచుతూ తమ తీర్పును వెలువరించారు. ఫలితాల వెల్లడి అనంతరం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ విజయోత్సవ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాణ్యం కావేరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో అఖండ విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన నూతన సర్పంచ్ పాణ్యం కావేరి, గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

సర్పంచ్ ఎన్నికల్లో కూటమి విజయంతో పలమనేరులో సంబరాలు

- **ఎమ్మెల్యే అమర్ సమక్షంలో ఘనంగా విజయోత్సవ వేడుకలు**



పలమనేరు నవంబర్ 27
(మనసులో మాట) :
పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధించడంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలమనేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.
ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులతో పాటు వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకోవడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విజయం సాధించిన ప్రజాప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టి తమ విజయానందాన్ని పంచుకున్నారు. తమపై నమ్మకం ఉంచి సర్పంచ్ పదవుల్లో గెలుపొందేందుకు సహకరించిన ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డికి ఈ సందర్భంగా విజేతలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మద్దతుతో సాధించిన ఈ విజయాన్ని మరింత బాధ్యతగా భావించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయం సాధించిన సర్పంచులు, వార్డు సభ్యులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతో పలమనేరు టీడీపీ కార్యాలయం విజయోత్సాహంతో కళకళలాడింది. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనుషుల వ్యక్తిత్వానికి సాహిత్యమే తోడ్పాటు..

- **ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా**







తిరుపతి ,మనసులో మాట
నవంబర్ ,27,
మనుషుల వ్యక్తిత్వాలను అంచనా వేయడానికి సాహిత్యమే తోడ్పడుతుందని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, గౌరవ అతిధి ఓల్గా అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 'శ్రీ పోపూరి వెంకట సుబ్బారావు ధర్మనిధి సదస్సు' తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆధునిక సాహిత్యంలో వివాహ వ్యవస్థ...స్త్రీ స్థితిగతులపై సదస్సు స్థానిక సావేరి సెమినార్ హాల్లో నిర్వహించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రబోధగీతంతో సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓల్గా ప్రసంగిస్తూ పరిపూర్ణ జీవితానికి స్వేచ్ఛ, బాధ్యత అవసరమని సూచించారు. నేటి యువత సామాజిక బాధ్యతలను గుర్తు యేరాగాలన్నారు. ఈ సదస్సుకు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని గత ఐదు సంవత్సరాలుగా దిగ్విజయంగా నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందని వివరించారు. డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒకప్పుడు ఆర్థిక స్వావలంబనతోనే స్త్రీకి గౌరవం దక్కేదని భావించేవారమని చెప్పారు. కానీ నేడు పరిస్థితులు మారాయని వెల్లడించారు. యువత సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించాలని ఆమె సూచించారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక ఉపన్యాసాలు తెలుగు అకాడమీ పూర్వ ఉపసంచాలకులు ఆచార్య సిహెచ్. సుశీలమ్మ ప్రసంగిస్తూ 'కుటీరలక్ష్మి' కథ స్త్రీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ఆమె తెలిపారు. 'ఒక్కరోజు' కథ స్త్రీల కోరికలు తీరని వైనాన్ని చూపుతుందని వివరించారు. హైదరాబాద్ కవయిత్రి శైలజా మిత్ర మరో అంశంపై మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు అని హితవు పలికారు. స్త్రీకి 'స్వతంత్రం' ఉండాలి కానీ విచ్చలవిడి 'స్వేచ్ఛ' అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు.
ఈకార్యక్రమం లో అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

విజేతలకు బహుమతులు..
కథల పోటీ విజేతలకు బహుమతులు నిర్వాహకులు అందజేశారు.
ప్రథమ బహుమతి.
సి.హెచ్.పి. రాజరాజేశ్వరి (ఎం.ఏ. తెలుగు)
ద్వితీయ బహుమతి.
కె. గాయత్రి, ఎస్.జె. లిఖిత (ఎల్.ఎల్.బి.)
తృతీయ బహుమతి.. దేవులపల్లి జ్యోతి వాసిని (ఎల్.ఎల్.బి.)
ఈ సదస్సులో డా. వై. సుభాషిణి, డా. వి. కృష్ణ వేణి ,
డా. డి. యువశ్రీ , డా. బి. లక్ష్మీ ప్రియ
ఆచార్యులు, విద్యార్థులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

కరుణే మనిషికి నిజమైన ఆభరణం..

- **- ఎదుటివారి కన్నీరు తుడవడమే మానవత్వం!**
- **- మనసున్న మనిషిగా జీవించడమే అసలైన గొప్పతనం**
- **- తోటి వారి బాధను అర్థం చేసుకోవడమే కరుణకు అర్థం**
- **- చిన్న సహాయం.. మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుంది**
- **- స్వార్థం, నిర్లక్ష్యం పెరుగుతున్న వేళ మానవీయ విలువల అవసరం**



రాయలసీమ బ్యూరో,నవంబర్ 27 (మనసులో మాట):

మనిషికి ఎన్నో గొప్ప లక్షణాలు ఉండవచ్చు. తెలివితేటలు, విద్య, సంపద, హోదా, అధికారం, పేరు ప్రతిష్ఠలు సంపాదించవచ్చు. కానీ వీటన్నింటికంటే విలువైనది ఇతరుల పట్ల చూపించే కరుణ, దయ, ప్రేమ, మానవత్వం. ఎదుటివారు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో అర్థం చేసుకుని, వారి బాధను మనసుతో అనుభూతి చెందడం, అవసరమైనప్పుడు అండగా నిలవడం ప్రతి మనిషిలో ఉండాల్సిన గొప్ప గుణం. అందుకే కరుణను మానవత్వానికి ప్రతిరూపంగా భావిస్తారు. ఒక వ్యక్తి ఎంత సంపన్నుడైనా, ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా అతనిలో ఇతరుల పట్ల దయ లేకపోతే ఆ గొప్పతనానికి అర్థం ఉండదు. అదే సాధారణ స్థాయిలో జీవించే వ్యక్తి తనకు చేతనైనంతలో మరొకరికి సహాయం చేస్తే సమాజంలో అతనికి ప్రత్యేకమైన గౌరవం లభిస్తుంది. ఎదుటివారి కన్నీటిని చూసి స్పందించే హృదయం ఉండటం, బాధలో ఉన్నవారికి ఓదార్పు ఇవ్వడం, కష్టాల్లో ఉన్నవారిని ఒంటరిగా వదిలేయకుండా తోడుగా నిలవడం నిజమైన మానవత్వానికి నిదర్శనాలు. ఈ విలువల ప్రాముఖ్యతను గుర్తుచేసే అంశమే ప్రపంచ కరుణా దినోత్సవం. మానవ సంబంధాలు మరింత బలపడాలంటే కరుణను జీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భం తెలియజేస్తుంది.

ప్రస్తుత ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా అభివృద్ధి చెందింది. ప్రపంచంలోని ఏ మూలలో ఏం జరిగినా క్షణాల్లో తెలుసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల ద్వారా వేలాది మందితో పరిచయాలు ఏర్పడుతున్నాయి. అయితే ఇంతటి సమాచార విప్లవం మధ్య కూడా మనుషుల మధ్య నిజమైన అనుబంధాలు తగ్గుతున్నాయనే ఆందోళన కనిపిస్తోంది. ఎదుటివారి కష్టాన్ని అర్థం చేసుకోవడం కంటే వారి పరిస్థితిని విమర్శించే ధోరణి పెరుగుతోంది. ఒకరు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే ఆదుకోవాల్సింది పోయి వారి పరిస్థితిని ఎగతాళి చేయడం, కుటుంబ సమస్యలతో బాధపడుతున్న వారిని మరింత కుంగదీయడం, అనారోగ్యంతో ఉన్నవారికి ధైర్యం చెప్పకుండా నిర్లక్ష్యం చేయడం వంటి ప్రవర్తనలు సమాజంలో మానవీయ విలువలు ఎంత అవసరమో గుర్తుచేస్తున్నాయి. ప్రతి ఒక్కరి జీవితంలోనూ కనిపించని ఎన్నో పోరాటాలు ఉంటాయి. బయటకు నవ్వుతూ కనిపించే వ్యక్తి కూడా లోపల ఎన్నో బాధలను అనుభవిస్తూ ఉండవచ్చు. అలాంటి సమయంలో తీర్పులు చెప్పడం కంటే వారి పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఒకరి మాటలను శ్రద్ధగా వినడం, బాధను పంచుకోవడం, తప్పుగా అర్థం చేసుకోకుండా ఓపికగా వ్యవహరించడం కూడా కరుణలో భాగమే. మనుషుల మధ్య దూరాలను తగ్గించి, పరస్పర గౌరవాన్ని పెంచే శక్తి కరుణకు ఉంది. కరుణ అంటే కేవలం పేదలకు డబ్బు ఇవ్వడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం పెట్టడం మాత్రమే కాదు. మన చుట్టూ ఉన్న ప్రతి జీవి పట్ల ప్రేమ, బాధ్యత, సహానుభూతి చూపించడం కూడా ఇందులో భాగమే. రోడ్డుపై ఆకలితో ఉన్న వ్యక్తికి భోజనం అందించడం, చదువు కోవడానికి ఆర్థిక స్థోమత లేని విద్యార్థికి పుస్తకాలు కొనివ్వడం, అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నవారికి అవసరమైన సహాయం చేయడం, వృద్ధాశ్రమాల్లోని పెద్దలతో కొంత సమయం గడపడం, అనాథ పిల్లలకు అండగా నిలవడం వంటి పనులు సమాజంలో మానవత్వాన్ని పెంచుతాయి. అంతేకాదు, ఒంటరితనంతో బాధపడుతున్న వ్యక్తితో ప్రేమగా మాట్లాడటం, నిరాశలో ఉన్నవారికి ధైర్యం చెప్పడం, ఉద్యోగం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నవారికి అవకాశాల గురించి తెలియజేయడం కూడా విలువైన సహాయాలే. మనం చేసే ప్రతి సహాయం ఆర్థికంగా పెద్దదై ఉండాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు మనం పలికే ఓ మంచి మాట, చూపించే చిన్నపాటి ఆప్యాయత, అందించే కొద్దిపాటి సమయం మరొకరి జీవితంలో ఎంతో పెద్ద మార్పును తీసుకురావచ్చు. సహాయం చేసిన తర్వాత దానిని ప్రచారం చేసుకోవడం కంటే ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా చేయడంలోనే నిజమైన కరుణ ఉంటుంది. మనకు సాధ్యమైనంతలో మరొకరి జీవితాన్ని కొంత మెరుగుపరచగలిగితే అదే గొప్ప సేవ. కరుణా భావన పెంపొందించడంలో కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం కీలక పాత్ర పోషిస్తాయి. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఇతరుల పట్ల గౌరవం, దయ, సహనం, సహాయం చేసే గుణాలను అలవాటు చేయాలి. ఇంట్లో తల్లిదండ్రులు పెద్దలను గౌరవించడం, అవసరంలో ఉన్నవారికి తోడ్పడటం, జంతువుల పట్ల ప్రేమ చూపించడం వంటి పనులు చేస్తే పిల్లలు వాటిని సహజంగానే అనుసరిస్తారు. పాఠశాలల్లో కూడా పుస్తక జ్ఞానంతో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. స్నేహితుడు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అతడిని ఆదుకోవడం, తోటి విద్యార్థులను అవమానించకుండా ఉండటం, భిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లలతో సమానంగా మెలగడం వంటి విషయాలను ఆచరణలో నేర్పించాలి. సమాజంలో కులం, మతం, భాష, ప్రాంతం, ఆర్థిక స్థితి వంటి భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ మనిషిగా గౌరవించే దృక్పథం పెరగాలి. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయులు, ప్రకృతి వైపరీత్యాల బాధితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వీరికి అవసరమైన సహాయం అందించేందుకు వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు కూడా ముందుకు రావాలి. ఒకరికి మరొకరు అండగా నిలిచే సమాజంలో అసహనం, ద్వేషం, విపక్ష తగ్గి ఐక్యత పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, పేదరికం, ఆకలి, నిరుద్యోగం, అనారోగ్యం వంటి ఎన్నో సమస్యలు కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కరుణకు మరింత ప్రాధాన్యం ఏర్పడుతోంది. యుద్ధాల కారణంగా ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు, ఆహారం కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు, ప్రకృతి విపత్తులతో సర్వం కోల్పోయిన ప్రజలు, అనారోగ్యంతో చికిత్స పొందలేక ఇబ్బందులు పడుతున్న పేదలు మన సహానుభూతి కోసం ఎదురుచూస్తున్నారు. వారి బాధలను కేవలం వార్తలుగా చూసి మరిచిపోకుండా, మన పరిధిలో చేయగలిగిన సహాయం అందించేందుకు ప్రయత్నించాలి. కరుణ అనేది బలహీనత కాదు.. అది మనిషిలోని గొప్ప బలం. ఎదుటివారిని క్షమించడం, వారి తప్పులను అర్థం చేసుకోవడం, కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం మన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. ఇతరుల పట్ల దయ చూపడం వల్ల సహాయం పొందినవారికి ఉపశమనం కలగడమే కాకుండా, సహాయం చేసిన వ్యక్తికి కూడా ఆత్మసంతృప్తి లభిస్తుంది. ప్రపంచ కరుణా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మంచి పనిని చేయాలని సంకల్పించుకోవాలి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కావచ్చు, బాధలో ఉన్నవారికి ఓదార్పు ఇవ్వడం కావచ్చు, అవసరంలో ఉన్నవారికి తోడుగా నిలవడం కావచ్చు.. ఏ రూపంలోనైనా కరుణను ఆచరణలో చూపించాలి. మనం సంపాదించే సంపద కంటే మన వల్ల మరొకరికి కలిగే మేలు, సాధించే విజయాల కంటే మనం పంచే ప్రేమ, చూపించే మానవత్వమే ఎక్కువకాలం గుర్తుండిపోతాయి. మనిషిగా పుట్టడం సహజం.. మనసున్న మనిషిగా జీవించడం గొప్పతనం. కరుణను ఒకరోజుకే పరిమితం చేయకుండా ప్రతిరోజూ ఆచరిస్తేనే మానవత్వంతో నిండిన అందమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

నూతన సర్పంచ్ మలిశెట్టి దిమతి ఆత్మీయ సత్కారం



రైల్వే కోడూరు, నవంబర్ 27 మనసులో మాట :

రైల్వే కోడూరు పట్టణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూటమి మద్దతుతో బరిలోకి దిగి ఘనవిజయం సాధించిన నూతన సర్పంచ్ మలిశెట్టి దిమతి, మలిశెట్టి భాస్కర్ గౌడ్ దంపతులు కూటమి అగ్రనేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. మలిశెట్టి మురళీధర్ గౌడ్, ఇతర ముఖ్య నాయకులతో కలిసి వెళ్లిన ఆమె.. రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు, కడప నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి, ముక్కా వరలక్ష్మి, ఓబులవారిపల్లె మండల పరిషత్ అధ్యక్షుడు ముక్కా సాయి వికాస్ రెడ్డిలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి విజయం పరించే వరకు అడుగడుగునా అండగా నిలిచి, తమ గెలుపునకు కృషి చేసిన నాయకులకు నూతన సర్పంచ్ దిమతి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి శ్రేణుల సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్‌కు అభినందనలు తెలిపిన ముక్కా రూపానంద రెడ్డి.. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణాభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు అంకితభావంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అరవింద్, భారతీయ జనతా పార్టీ నాయకులు చెంగల్ రాజు, పుల్లంపేట మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు మనోహర్ రెడ్డి, చిన్న, వార్డు సభ్యులు మరియు పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేసిన కలెక్టర్



తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

విద్యార్థులలో ఎన్నికల అవగాహనను పెంపొందించడానికి, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడానికి నిర్వహించిన క్విజ్, వ్యాస రచన పోటీల ఫలితాలను తిరుపతి కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా, జిల్లా స్థాయి విజేతలు కనబరిచిన అద్భుతమైన ప్రతిభ మరియు విజయాలకు గుర్తింపుగా వారికి సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియలు మరియు ఎన్నికలలో చురుకైన భాగస్వామ్యం ప్రాముఖ్యత గురించి విద్యార్థులలో జ్ఞానం, సృజనాత్మకత, అవగాహనను పెంపొందించడానికి ప్రోత్సహిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డి ఆర్ ఓ నరసింహులు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

విద్యార్థులు కడప జిల్లా సీనియర్ త్రోబాల్ జట్టుకు ఎంపిక



చెన్నూరు ,మనసులో మాట,
నవంబర్ ,27,

కడప స్థానిక ప్రకాష్ నగర్ లోని క్వాంటం హైట్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎస్.కె ఉమర్ ఎం అభిషేక్ .న 26 నవంబరు 2026 తేదీన గురువారం జమ్మల మడుగు మండలం గురిగినూరు గ్రామంలో జిల్లాస్థాయి ఎంపికలకు హాజరై అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 29వ తేదీన కృష్ణాజిల్లా విజయవాడ పట్టణంలో జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని స్కూల్ కరస్పాండెంట్ నరేందర్ రెడ్డి డైరెక్టర్ కేజే కేశవరెడ్డి లు తెలిపారు విద్యార్థులు ఎంపిక పట్ల స్కూలు యాజమాన్యం మరియు స్కూల్ ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేసి ముమ్ముందు పోటీలలో కూడా విజయకేతనం ఎగురవేయాలని ఆకాంక్షించారు ఈ యొక్క కార్యక్రమంలో స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు యు శ్రీనివాసులు ఏవో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు,

ఏకగ్రీవంతో గ్రామం అభివృద్ధి



ముత్తుకూరు. నవంబర్.27
(మనసులోమాట)

బ్రహ్మదేవం పంచాయతీని ఏకగ్రీవం చేసుకోవడం వల్ల ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ తో గ్రామంలో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని బ్రహ్మదేవం టిడిపి బలపరిచిన అభ్యర్థి కొత్తపల్లి రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయాలని ఉద్దేశంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను రాజ్యాంగబద్ధంగా నిర్వహిస్తున్నారు అన్నారు. అలాగే ఏకగ్రీవ పంచాయతీలను ప్రోత్సహించేందుకై ప్రభుత్వం ప్రోత్సాహకాలను భారీగా ప్రకటించింది అన్నారు. గ్రామంలోని ప్రజలు ఆలోచించి ఏకగ్రీవానికి అంగీకరించడం వల్ల గ్రామం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అధికారంలో ఉన్న పార్టీ బలపరిచిన అభ్యర్థి పంచాయతీలో కూడా సర్పంచిగా ఉండటం వల్ల గ్రామం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీని ఏకగ్రీవం చేసుకునేందుకు గ్రామ ప్రజలు గ్రామంలో పోటీ చేసిన అభ్యర్థులు సహకరించాలని ఆయన కోరారు.

బ్రౌన్ గ్రంథాలయ నూతన భవనం అదనపు అంతస్తులకు రూ.4.50 కోట్లు విడుదల, వార్షిక గ్రాంట్ పెంపు కోసం ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

- **సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్..**

చెన్నూరు ,మనసులో మాట
నవంబర్, 27,

కడపలోని ప్రఖ్యాత సి.పి. బ్రౌన్ గ్రంథాలయం & భాషా పరిశోధనా కేంద్రం నూతన అదనపు భవనంలోని 2, 3 అంతస్తుల నిర్మాణం కోసం రూ. 4.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని, గ్రంథాలయ నిర్వహణ ప్రస్తుత వార్షిక గ్రాంట్‌ను రూ.10 లక్షల నుండి రూ. 25 లక్షలకు పెంచాలని కోరుతూ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయ భాస్కర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు.

నిధుల జాప్యంపై ఆవేదన..

ఫైళ్ల కదలికపై సూచన..

బ్రౌన్ గ్రంథాలయ చారిత్రక ప్రాధాన్యతను, తెలుగు భాషా సాహిత్య పరిరక్షణకు అది అందిస్తున్న సేవలను జానమద్ది వివరించారు. అదనపు భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయినప్పటికీ, మిగిలిన 2, 3 అంతస్తులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో వినియోగం లోకి తీసుకురావడానికి నిధుల కొరత ఎదురవు తోందని ఆయన తెలిపారు. తొలుత రూ.4.40 కోట్ల అంచనాతో కలెక్టర్ 010126 తేదీన ప్రతిపాదనలు పంపగా, నిధుల విడుదలలో జాప్యం





కారణం గా నిర్మాణ సామగ్రి, ఇతర వ్యయాలు పెరిగి అంచనా రూ.4.50 కోట్లకు చేరిందని ఆయన చెప్పారు.గతంలో ఉగాది పురస్కార ప్రదానోత్స వ సభలో కలిసినప్పుడు విజ్ఞప్తి చేయగాముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినప్పటికీ, ఆర్థిక శాఖ,ఉన్నత విద్యాశాఖలలో ఫైళ్లు పెండింగ్‌లో ఉండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పెండింగ్ ఫైళ్లను తక్షణమే పరిష్కరించి, నిధుల విడుదలలో ఇకపై ఎలాంటి జాప్యం జరగ కుండా తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన సూచించారు.

గ్రాంట్ పెంపుతోనే విస్తృత సేవలు

ప్రస్తుతం అందుతున్న రూ. 10 లక్షల వార్షిక గ్రాంట్ పెరిగిన నిర్వహణ ఖర్చులు, పుస్తకాల కొనుగోలు, సాహిత్యపరిశోధనా కార్యక్రమాలు, అరుదైన గ్రంథాల సంరక్షణకు ఏమాత్రం సరిపోవడం లేదని ఆయన అన్నారు. వార్షిక గ్రాంట్‌ను రూ.25 లక్షలకు పెంచితే గ్రంథాలయ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి, భాషాభిమానులకు,విద్యార్థులకు, పరిశోధకులకు విస్తృత సేవలు అందించవచ్చని ఆయన వెల్లడించారు. 1995 నవంబర్ లో ప్రస్తుత గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి కి ఈ సంస్థపై ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేస్తూ, రెండు అంశాలపై తక్షణమే అనుకూలనిర్ణయం తీసుకోవాలని జానమద్ది విజయ భాస్కర్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

- **21వ డివిజన్ అభివృద్ధిపై అడిషనల్ కమిషనర్ హిమబిందు సమీక్ష**
- **ప్రజల మధ్యకు కార్పొరేటర్ విజయలక్ష్మి**



నెల్లూరు, ప్రతినిధి, నవంబర్ 27,
మనసులో మాట:

నగరంలోని 21వ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్పొరేటర్ గునుకుల విజయలక్ష్మి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించడంతో పాటు, డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.

ఇందులో భాగంగా అడిషనల్ కమిషనర్ హిమబిందు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 21వ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలు, పురవిత్ర యాప్ ద్వారా నమోదైన ఫిర్యాదులు, వాటి పరిష్కార స్థితిగతులు, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, రహదారులపై గుంతలకు మరమ్మతులు, ఎండ్ టు ఎండ్ రోడ్ల నిర్మాణం, కాలువలు లేని ప్రాంతాల్లో కొత్త కాలువల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ అభివృద్ధి దృక్పథానికి అనుగుణంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ కోరారు. అనంతరం ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈవినింగ్ వాక్ విత్ కార్పొరేటర్ విజయలక్ష్మి కార్యక్రమంలో భాగంగా రామ్మీనగర్‌లోని 4, 5, 7, 8వ వీధుల్లో కార్పొరేటర్ విజయలక్ష్మి, జనసేన నాయకులు కిషోర్ గునుకుల పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులు, ఇతర మౌలిక వసతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన పలు వినతులను డిప్యూటీ అడిషనల్ మేయర్‌కు అందజేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచిస్తున్న ప్రజా జవాబు దారీతనం, పారదర్శక పాలన స్ఫూర్తితో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వినడమే కాకుండా, అవి పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించడమే తమ బాధ్యతని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మంత్రి పొంగూరు నారాయణ చేపడుతున్న నగర అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ, ప్రజాప్రతినిధుల చొరవ, ప్రజల సహకారంతో 21వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, కార్పొరేటర్ విజయలక్ష్మి గునుకుల, నరహరి, బాలు, ఆమని, ప్రశాంత్ గౌడ్, బాలాజీ, విజయ, శ్రీలక్ష్మి, మల్లారెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, ప్రతాప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

పోట్లమర్రి సర్పంచ్‌గా విజయం సాధించిన కొండేటి చంద్రకళకు ఘన సన్మానం!

- **అత్యధిక మెజారిటీతో గెలిపించిన గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన గంటాపురం జగ్గు**



బత్తలపల్లి నవంబర్ 27 (మనసులో మాట)

బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి కొండేటి చంద్రకళ అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన సందర్భంగా ఆమెకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గంటాపురం జగ్గు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అభిమానులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సర్పంచ్ కొండేటి చంద్రకళకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆమె విజయాన్ని సంబరంగా జరుపుకుంటూ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గంటాపురం జగ్గు మాట్లాడుతూ.. కోట్లమరి గ్రామ ప్రజలు తమపై ఎంతో నమ్మకం, విశ్వాసం ఉంచి తన సతీమణి కొండేటి చంద్రకళను అత్యధిక మెజారిటీతో గెలిపించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా గ్రామ ఓటర్లకు హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని, మౌలిక వసతుల కల్పనతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.తమకు రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ సమానమేనని, ప్రతి ఒక్కరినీ కలుపుకొని కోట్లమరి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని గంటాపురం జగ్గు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24x7 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు ప్రతినెలా తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచబడిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్,సి డబ్ల్యూ సి గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో సీసీ కెమెరాలు,సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్స్ లు గోడౌన్లో భద్రపరచడం జరిగిందని, ప్రతి నెల, మూడు నెలలకు ఒకసారి గోడౌన్ లోపల పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మార్మోగిన కపిలేశ్వరాలయం

- **భక్తిభావంతో శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన**



తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

తిరుపతిలోని ప్రసిద్ధ శ్రీ కపిలేశ్వరస్వామి వారి ఆలయం శుక్రవారం "ఓం నమః శివాయ" పంచాక్షరీ మంత్ర ఘోషతో ప్రతిధ్వనించింది. భక్తుల హర హర మహాదేవ నామస్మరణల మధ్య స్వామివారికి లక్ష బిల్వార్చన సేవ శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా జరిగింది. ఆలయమంతా ఆధ్యాత్మిక శోభతో, దివ్య కాంతులతో విరాజిల్లింది. ఈ పవిత్ర కార్యక్రమంలో భాగంగా తెల్ల వారుజామున 3 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ అభిషేకం, అలంకారం, అర్చన వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లక్ష బిల్వార్చన సేవ భక్తిశ్రద్ధలతో కొనసాగింది. త్రిదళాలతో కూడిన పవిత్ర లక్ష బిల్వ పత్రాలతో వేద పండితులు, ఆలయ అర్చకులు ఆగమోక్తంగా స్వామివారిని అర్చించారు. శివునికి అత్యంత ప్రీతికరమైన బిల్వార్చనను కనులారా వీక్షించి భక్తులు పులకించిపోయారు.

ఉత్సవమూర్తుల పురవీధి ఊరేగింపు

సాయంత్రం 6 గంటలకు శ్రీ చంద్రశేఖర స్వామి వారు,శ్రీ కామాక్షి అమ్మవారి ఉత్సవమూర్తులను పుష్పాలంకృతులను చేసి తిరుపతి పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.మంగళవాయిద్యాలు, భజన బృందాల కోలాటాల నడుమ సాగే ఈ ఊరేగింపును దర్శించి భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో కుమారి దేవి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి వేడుకలు

ధర్మవరం నవంబర్ 27 (మనసులో మాట)

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పరిపాలన అధికారిని ఖతిజూన్ కుప్రా ఆధ్వర్యంలో భక్త కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఖతిజూన్ కుప్రా మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి ఆయన కీర్తనలు ఎంతో దోహదపడ్డాయి అని తెలిపారు. భక్త కనకదాసు జీవిత విశేషాలను, సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.దాస సాహిత్యంలో భాగంగా శ్రీకృష్ణుని అపారమైన భక్తితో సేవిస్తూ, అనాటి సమాజంలో వేళ్లూనుకున్న కుల వ్యవస్థను, అసమానతలను వ్యతిరేకిస్తూ కనకదాసు ఆలపించిన కీర్తనలు సమాజ చైతన్యానికి ఎంతో మేలు చేశాయి అని పేర్కొన్నారు.భక్తి మార్గంలో పయనిస్తూనే, సమాజం పట్ల తన బాధ్యతను ఆయన చక్కగా నిర్వర్తించారని తెలిపారు.నేటి తరం కూడా సమాజంలోని కుల వివక్ష, దురాచారాలను వ్యతిరేకిస్తూ కనకదాసు చూపించిన ఆదర్శ మార్గంలో పయనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వోలు నరేష్, సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సానే వారిపల్లిలో శ్రీనాథ్ విజయకేతనం



- **15 ఓట్ల మెజారిటీతో సర్పంచ్ పీఠం కైవసం.. గెలుపుతో వైఎస్సార్సీపీ శ్రేణుల్లో ఉత్సాహం**

ముదిగుబ్బ, నవంబర్ 27: (మనసులో మాట)

ముదిగుబ్బ మండలం సానే వారిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో టి. శ్రీనివాసులు (శ్రీనాథ్) 15 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి సర్పంచ్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ వరకు ఉత్కంఠగా సాగిన పోటీలో ఓటర్లు శ్రీనాథ్‌కు మద్దతు పలకడంతో ఆయన విజయాన్ని అందుకున్నారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఓట్ల రూపంలో అందించి గెలిపించడం పట్ల శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేశారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్క ఓటరికి, అభిమానులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల సమష్టి కృషి, ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచిన వారి మద్దతే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. సర్పంచ్‌గా విజయం సాధించిన సందర్భంగా వైఎస్సార్సీపీ శ్రేణులు, అభిమానులు, మద్దతుదారులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. పరస్పరం సన్మానించుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకుంటూ విజయోత్సాహాన్ని పంచుకున్నారు. గ్రామంలో ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. 15 ఓట్ల స్వల్ప మెజారిటీతో సాధించిన ఈ విజయం సానే వారిపల్లి గ్రామ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను గుర్తించి గ్రామ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీనివాసులు ఆకాంక్షించారు. గ్రామ ప్రజల మద్దతుతో ముందుకు సాగుతానని తెలిపారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సిబ్బంది కేటాయింపు పూర్తి



- **1,951 పోలింగ్ కేంద్రాలకు 4,353 మంది సిబ్బంది నియామకం**
- **– జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

నెల్లూరు, ప్రతినిధి, నవంబర్ 27, మనసులో మాట:

జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించి చివరి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ విధానం ద్వారా రెండో విడత ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఏ పోలింగ్ కేంద్రంలో ఏ సిబ్బంది విధులు నిర్వహించాలనే విషయాన్ని ఖరారు చేశారు. రెండో విడతలో జిల్లాలోని 14 మండలాల పరిధిలో మొత్తం 2,714 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వీటిలో 763 కేంద్రాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 1,951 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 1,951 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,951 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 389 మంది మొదటి అదనపు పోలింగ్ అధికారులు, 62 మంది రెండో అదనపు పోలింగ్ అధికారులతో కలిపి మొత్తం 4,353 మంది సిబ్బందిని నియమించారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మరో 480 మంది సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు. అలాగే ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు 14 మండలాల్లో 208 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించగా, మరో 42 మందిని రిజర్వ్‌లో అందుబాటులో ఉంచారు. మొత్తంగా 250 మంది సూక్ష్మ పరిశీలకులను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ గా మోహన్ రెడ్డిని గెలిపించండి



ముత్తుకూరు. నవంబర్.27. (మనసులోమాట)

మండలంలోని బ్రహ్మదేవం పంచాయతీ సర్పంచ్ గా వైసిపి బలపరిచినచల్ల మోహన్ కుమార్ రెడ్డి ని గెలిపించాలంటూ భార్య చల్ల సీతారెడ్డి పంచాయతీలోని ముస్లిం వీధి, గురవయ్య సాల గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త మోహన్ కుమార్ రెడ్డి రైతులకు అన్ని విధాల సహకరించి సహకారాలు అందిస్తున్నాడని ఇప్పటికే పంచాయతీ ప్రజలకు తన భర్త సుపరిచితుడేనని ఆమె తెలిపారు. ఇప్పటివరకు తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నాడని, పంచాయతీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించి పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకై తన భర్తకు ఓటు వేసి గెలిపించాలని ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నేతలు ఎంపీటీసీ సభ్యులు కట్ట సుబ్రహ్మణ్యం, మస్తాన్, జమీల్ భాష, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

నాస్కామ్ తో వైవియు ఉద్యోగ కల్పన అవగాహన ఒప్పందం





చెన్నూర్, మనసులో మాట, నవంబర్, 27,

నాస్కామ్ ఫ్యూచర్‌స్కిల్స్ వంటి వేదికలు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించి, భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు అందుకునేలా వారిని సంసిద్ధులను చేయడమే లక్ష్యంగా యోగివేమన విశ్వవిద్యాలయం, నాస్కామ్, ఫ్యూచర్‌స్కిల్స్, మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంవోయు) కుదిరింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్‌లో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంప్రదాయ విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నూతన సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ తదితర అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పరిశ్రమలకు అనుగుణమైన ఆన్‌లైన్ కోర్సులు, అభ్యసన మార్గాలు, నైపుణ్య అంచనాలు, సర్టిఫికేషన్ అవకాశాలను పొందవచ్చన్నారు. రిజిస్ట్రార్ ఎం.సి. గంగిరెడ్డి, రెక్టార్ ఆచార్య ఏ.జి. దాము మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం చేపడుతున్న పరిశ్రమ-విద్యా సంస్థల అనుసంధాన కార్యక్రమాల్లో ఈ ఒప్పందం మరో ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (ఎన్ ఎ ఎస్ ఎస్ సి ఓ ఎం) ఆంధ్రప్రదేశ్ తెలంగాణా డైరెక్టర్ డాక్టర్ బొజ్జం ప్రవీణ్ కుమార్ అందిస్తున్న వివిధ ఉచిత సాంకేతిక శిక్షణ కార్యకమాల గురించి వాటి ఆవశ్యకత గురించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వైవీయు నుంచి కొంత మంది విద్యార్థులను ప్రతినిధులుగా నియమించారు. ఎంసీఐఇ ఇండియా తరపున ఇలయ తగరం మాట్లాడుతూ నాస్కామ్ ఫ్యూచర్‌స్కిల్స్ ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆన్‌లైన్ కోర్సులు, ఆధునిక సాంకేతిక శిక్షణా అవకాశాలు, రిజిస్ట్రేషన్ విధానం తదితర అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రారంభ దశలో భాగంగా యూజీ, పీజీ విద్యార్థుల వివరాలను నిర్దేశిత నమూనాలో సేకరించి సంబంధిత డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు. విద్యార్థులకు కోర్సుల ఎంపిక, రిజిస్ట్రేషన్, అభ్యసన విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్లేస్ మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ భారతి మాట్లాడుతూ పరిశ్రమల్లో ఉద్యోగులు గా కాకుండా పారిశ్రామికవేత్తలు ఎదిగేలా మీ ఆలోచనలు సాగాలన్నారు. విశ్వవిద్యాలయ బీసీడీఈ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.



అబ్దుల్ గని జ్యూయలరీ ప్రారంభం

- **నాణ్యత, నమ్మకానికి కొత్త చిరునామాగా నిలవాలి.. హజరత్ సాజిద్ ప్రత్యేక దువా**
- **బంగారు, వెండి ఆభరణాల్లో సరికొత్త డిజైన్లు.. కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా ప్రత్యేక తయారీ**

ముదిగుబ్బ, నవంబర్ 27: (మనసులో మాట)

బంగారు, వెండి ఆభరణాల కొనుగోలుదారులకు సరికొత్త డిజైన్లు, నాణ్యమైన ఆభరణాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముదిగుబ్బ పట్టణంలోని పాత రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన అబ్దుల్ గని జ్యువెలరీ నూతన దుకాణం ఆదివారం ఉదయం 10 గంటలకు ఘనంగా ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నమాజ్ అనంతరం జామియా మసీదు హజరత్ సాజిద్ ఆధ్వర్యంలో జమాత్ సభ్యులు ప్రత్యేక దువా నిర్వహించారు. నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, యజమానులకు అభివృద్ధి, శుభాలు కలగాలని, వినియోగదారుల ఆదరణ పొందుతూ నాణ్యత, నమ్మకం, నీతి నిజాయితీలకు ప్రతీకగా నిలవాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. నూతనంగా ప్రారంభం కానున్న అబ్దుల్ గని జ్యువెలరీలో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన ఆధునిక డిజైన్లలో బంగారు, వెండి ఆభరణాలు అందుబాటులో ఉండనున్నాయి. 91.6 BIS హాల్‌మార్క్ బంగారు ఆభరణాలతో పాటు వివిధ రకాల వెండి ఆభరణాలు, కస్టమర్లు కోరుకున్న ప్రత్యేక డిజైన్లలో ఆర్డర్లపై ఆభరణాలను తయారు చేసి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగలు, పుట్టినరోజులు, ఇతర ప్రత్యేక సందర్భాలకు తగిన ఆభరణాలను ఒకే చోట అందుబాటులో ఉంచుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, పారదర్శకమైన వ్యాపార విధానాలతో కస్టమర్ల విశ్వాసాన్ని చూరగొనడమే తమ లక్ష్యమన్నారు. ముదిగుబ్బ పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆదివారం జరిగే ప్రారంభోత్సవానికి హాజరై నూతన షాపును సందర్శించి తమ వ్యాపారాన్ని ఆదరించాలని నిర్వాహకులు కోరారు.



అబ్దుల్ గని జ్యువెలరీ
పాత రైల్వే స్టేషన్ రోడ్, ముదిగుబ్బ సెల్ నెంబర్:
99862 47565 | 86602 97383 | 94496 66813

"మీ బంగారు కలలకు మెరుగులు దిద్దే నూతన చిరునామా – అబ్దుల్ గని జ్యువెలరీ"

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా ఇర్సలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ఎన్నో ఏళ్ల లో వోల్టేజ్ కష్టాలకు విద్యుత్ శాఖ చెక్!

- **ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త 11 కేవీ లైన్.. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి చొరవ చూపిన విద్యుత్ అధికారులు.. కళాశాల వర్గాల హర్షం**





ముదిగుబ్బ, నవంబర్ 27:
(మనసులో మాట)

సమస్యను గుర్తించడం, పరిష్కారానికి చొరవ చూపడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ శాఖల అధికారుల బాధ్యతకు నిదర్శనమని చెప్పేలా ముదిగుబ్బ విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముదిగుబ్బ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత కొన్ని సంవత్సరాలుగా వేధిస్తున్న లో వోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం చూపడంతో కళాశాల వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. కళాశాలలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థుల చదువుకు, కళాశాలలో విద్యా కార్యకలాపాల నిర్వహణకు లో వోల్టేజ్ సమస్య ఆటంకంగా మారుతున్న పరిస్థితులను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు సమస్య పరిష్కారానికి కార్యాచరణ చేపట్టారు. కేవలం తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, విద్యుత్ సరఫరా మెరుగుపడేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టడం విశేషం. కళాశాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు దాదాపు అర కిలోమీటరు మేర కొత్తగా 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం అవసరమైన విద్యుత్ స్తంభాలను అమర్చి, కొత్త విద్యుత్ తీగలను లాగడంతో పాటు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ పనులు పూర్తికావడంతో కళాశాలలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని విద్యుత్ అధికారులు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు విద్యుత్ వెలుగులు..

విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సమస్యను గుర్తించి అవసరమైన విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఈఈ కృష్ణదేవ్ తెలిపారు. సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనులు పూర్తి చేసి కళాశాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చూపే చొరవకు ఈ చర్య నిదర్శనంగా నిలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లో వోల్టేజ్ సమస్య పరిష్కారం కావడంతో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడేలా సమస్యను పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారుల సేవలను స్థానికులు అభినందిస్తున్నారు.

పిడతాపోలూరు సర్పంచిగా మేకల అనూష



ముత్తుకూరు. నవంబర్27.
(మనసులోమాట)

మండలంలోని పిడతా పోలూరు పంచాయతీ సర్పంచ్ గా ఉమ్మడి అభ్యర్థి మేకల అనూష ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుక్రవారం ధ్రువీకరణ పత్రాన్ని అనూషకు అందజేశారు. రెండు ఎంపీటీసీ స్థానాలు ఉన్న ఈ పంచాయతీకి సుమారు 4,000 ఓట్ల వరకు ఉన్నాయి. ఇరు పార్టీల అభ్యర్థులు ఏకగ్రీవం చేసుకుంటే పంచాయతీకి ప్రభుత్వం ఇచ్చే పారితోషకం వచ్చే అవకాశం ఉన్నందున ఆ నిధులతో పంచాయితీని అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచనతో రావడంతో అధికార ప్రతిపక్ష పార్టీలు అవగాహన కు వచ్చి ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎంపీటీసీ సభ్యులు మేకల రమణయ్య కోడలు మేకల అనుషను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ఒక్క నామినేషన్ మాత్రమే వేయించారు. అలాగే 14 వార్డులు ఉన్న ఈ పంచాయతీలో వార్డులు కూడా ఏకగ్రీవం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, కొండారెడ్డి, సర్పంచ్ భర్త మేకల రమేష్ లు పాల్గొన్నారు.

ఏక గ్రీవాలు అధికార పార్టీ అంగీకరించని ప్రతిపక్షం

ముత్తుకూరు. నవంబర్.27
(మనసులోమాట)

రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రకటించిన పారితోషికంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచనతో అధికార పార్టీకి చెందిన సర్పంచి అభ్యర్థులు వార్డు మెంబర్లు అధికార పార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలకు ప్రతిపక్షం అంగీకరించకపోవడంతో పలు పంచాయతీలు ఏకగ్రీవాలకై చర్చలు జరిపిన ప్రయోజనం లేకుండా పోయింది. పంటపాలెం, పొలం రాజు గుంట, వల్లూరు, బ్రహ్మదేవం పంచాయతీలలో అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీలు చర్చలు జరిపిన ప్రయోజనం లేకుండా పోయింది. అధికారంలో ఉన్నాము కాబట్టి నమ్మకం సర్పంచ్ పదవి ఇవ్వాలంటూ, ఉప సర్పంచ్ పదవి ప్రతిపక్షానికి ఇస్తామంటూ అధికార పార్టీ జరిపిన చర్చలు ఫలించలేదు. ప్రతిపక్ష పార్టీ తామేమి తీసుకోలేదని తమ ఓటు బ్యాంకు పై తమకు నమ్మకం ఉందని తామే ఈ ఎన్నికల్లో సర్పంచ్ గా గెలుపొందే అవకాశం ఉంది అన్న ధీమాతో తమకే సర్పంచి పదవి ఇవ్వాలంటూ పట్టు పట్టడంతో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరక మండలంలోని 20 పంచాయితీలలో 18 పంచాయితీలలో డిసెంబర్ రెండవ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. దీంతో ఇరు పార్టీలకు ఎన్నికలు అంటే ఖర్చుతో కూడుకున్నది కనుక ఎన్నికలు చేసేందుకై అవసరమైనటువంటి నిధులను సమకూర్చుకునుకునే పనిలో ఇరు పార్టీల అభ్యర్థులు పడిపోయారు. అలాగే గుర్తులు కూడా మధ్యాహ్నం మూడు గంటల పైన అధికారులు అభ్యర్థుల కేటాయించడంతో సాయంత్రం నుండే గుర్తులు చెప్పుకుంటూ పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం ప్రారంభించేశారు. ఏకగ్రీవంగా పాటూరు వారి కండ్రిగ సర్పంచిగా అధికార పార్టీకి చెందిన పాపారెడ్డి సుహాసిని ఏకగ్రీవం అయినట్టు అధికారులు ప్రకటించారు. ఈ పంచాయతీ ఉప సర్పంచ్ గా వైసీపీకి చెందిన మాజీ రెడ్డి శార్వాణికి ఇవ్వడం జరిగింది. అలాగే పిడతాపోలూరు పంచాయతీలో ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థికి సర్పంచ్ గా మాజీ ఎంపీటీసీ సభ్యులు మేకల రమణయ్య భార్యకు ఇవ్వడం జరిగింది. ఇక్కడ అధికార పార్టీకి సర్పంచ్ పదవి దక్కలేదు. మండలంలో ప్రతిపక్ష పార్టీ కి పట్టు ఉండడంతో ఎన్నికలు ఎక్కువ పంచాయతీలలో అని వారి అయింది.

బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును దెబ్బతీస్తాయి**
- **– డిప్యూటీ డీఈఓ శ్రీ నాయక్, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి సురేష్**



నెల్లూరు, ప్రతినిధి, నవంబర్ 27,
మనసులో మాట:

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ శ్రీ నాయక్, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి సురేష్ పిలుపు నిచ్చారు. బాల్య వివాహ రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బాల్య వివాహ ముక్త భారత్ ప్రచారంలో భాగంగా అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని మూలాపేట దేశిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ శ్రీ నాయక్ మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా బాలికల విద్యాభ్యాసం మధ్యలోనే ఆగిపోవడమే కాకుండా వారి ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు విద్య, వ్యక్తిగత అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వాటి నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థినులతో బాల్య వివాహాలను ప్రోత్సహించబోమని, వాటి నిర్మూలనకు కృషి చేస్తామని, బాల్య వివాహ రహిత భారతదేశ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీజేడబ్ల్యూఎస్ డైరెక్టర్ శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఐసీపీఎస్, చైల్డ్‌లైన్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

తిరుపతి 5వ డివిజన్‌లో శ్రీ రత్న మెడికల్ షాపు ప్రారంభం



- ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు, మందులు అందించాలి – ప్రారంభోత్సవంలో డాక్టర్ రణధీర్ రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

తిరుపతి నగరంలోని 5వ డివిజన్, పాత హీరో హోండా షోరూం సమీపంలోని 60 అడుగుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రత్న మెడికల్ షాపును శుక్రవారం ఉదయం 8 గంటలకు ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సారా హాస్పిటల్ అధినేత డాక్టర్ రణధీర్ రాజు, సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి ముఖ్య అతిథులుగా హాజరై మెడికల్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా మెడికల్ షాపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు నాణ్యమైన మందులు, మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. గరుడాద్రి నగర్, ప్రగతి నగర్, లెనిన్ నగర్, కొరవెనుగుంట, పోస్టల్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ఈ మెడికల్ షాపు సేవలను వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరత్న మెడికల్ షాపు యాజమాన్యం ఎం.ఆర్. బాబు, రత్నకుమారి, వినోద్ కుమార్, డాక్టర్ పావని తదితరులు పాల్గొని ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి తో కౌన్సిలర్లు పరిచయ కార్యక్రమం



పలమనేరు నవంబర్ 27 (మనసులో మాట) :

పలమనేరు మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి తో పాటు వైస్ చైర్మన్ కౌన్సిలర్లు అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ లోకేశ్వర వర్మ నిర్వహించారు. పలమనేరు మున్సిపాలిటీలోని నూతనంగా ఎన్నికైన 36 మంది కౌన్సిలర్లను పరిచయం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... ప్రజల అర్జీలను తక్షణమే పరిష్కరించేందుకు వీలుగా ప్రతి సోమవారం ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి 1 గంట వరకు మున్సిపల్ ప్రధాన కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. సమన్వయంతో అందరూ పనిచేయాలని చైర్మన్ తెలిపారు. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి దిశ నిర్దేశంతో మార్గదర్శకాలతో పట్టణాభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కార పాలకవర్గం అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. మౌలిక కల్పనకు మొదటి ప్రాధాన్యత అన్నారు. పలమనేరు పట్టణాన్ని ఒక ఆదర్శవంతమైన స్మార్ట్ పలమనేరుగా అభివృద్ధి చేసిన పలమనేరుగా తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామ గ్రామాన అభివృద్ధే లక్ష్యం

- – మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- ఆత్మకూరు నియోజకవర్గంలో 135 గ్రామ పంచాయతీలకు గాను 52 పంచాయతీలు ఏకగ్రీవం
- ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మంత్రి అభినందనలు





నెల్లూరు, ప్రతినిధి, నవంబర్ 27, మనసులో మాట:

గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సూచించారు. శుక్రవారం నెల్లూరులోని మంత్రి ఆనం నివాసంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలకు ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి అభినందనలు తెలిపి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గా లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యతను తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 135 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇప్పటికే 52 గ్రామ పంచాయతీల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని మంత్రి వెల్లడించారు. మిగిలిన 83 గ్రామ పంచాయతీలకు ఈ నెల 29వ తేదీ ఆదివారం రెండో విడత ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు తమ ఆశీస్సులు అందించి భారీ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ ప్రజలకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రెండో దశ పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగింపు



(మొదటి పేజీ తరువాయి)

ఆత్మకూరు, గూడూరు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలోని 14 మండలాలు, 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో 97 రూట్లలో ఉన్న 214 గ్రామ పంచాయతీలకు రెండో దశలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, మైకులు, లౌడ్ స్పీకర్ల వినియోగం తో పాటు టెలివిజన్, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాలతో సంబంధం లేని రాజకీయ నాయకులు, ప్రచారకర్తలు, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వెంటనే ఆయా గ్రామాలను విడిచివెళ్లాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, నిరంతర పోలీసు గస్తీ, తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం, నగదు, మద్యం పంపిణీ చేయడం వంటి ఎన్నికల అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఎక్కడైనా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు, అక్రమాలు లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా ఐశ్వర్యం.. సంచలన తెలుగు దిన పత్రిక

అనారోగ్యంతో దొరిగల్లు వీఆర్ఏ పెద్దన్న మృతి

- **అంత్యక్రియలకు రూ.15 వేల ప్రభుత్వ ఆర్థిక సహాయం అందజేసిన తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి**



ముదిగుబ్బ, నవంబర్ 27:
(మనసులో మాట)

ముదిగుబ్బ మండలం దొరిగల్లు గ్రామానికి చెందిన వీఆర్ఏ పెద్దన్న అనారోగ్యంతో మృతి చెందారు. వీఆర్ఏ మృతి వార్త తెలుసుకున్న తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం తరపున అంత్యక్రియల నిర్వహణకు అందించే రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతుడు పెద్దన్న భౌతికకాయానికి పూలహారం వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం కుటుంబానికి కొంత ఊరటని స్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించిన వీఆర్ఏ మృతి పట్ల తోటి ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు, విలేజ్ రెవెన్యూ సహాయ కుల సంఘం అధ్యక్షుడు ఓబులపతి, కోనయ్య, సుధాకర్, రామకృష్ణ, ఓబులేసు, బాలస్వామి, రామాంజనేయులు, చంద్ర, కె.శ్రీనివాసులు, వీఆర్వో కులశేఖర్ రెడ్డి, జయరాం రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు కూడా మృతునికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

జనసేన బలపరిచిన కోనేటివారి పల్లి గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం

- **శుభాకాంక్షలు తెలిపిన జనసేన ఇన్చార్జ్ పోతుల సాయినాథ్**
- **గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా సర్పంచ్ మండ్యం నాగవేణి**



ములకలచెరువు :27 నవంబర్
(మనసులో మాట)

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మండలం కోనేటివారిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు మండ్యం సుబ్రమణ్యం సతీమణి మండ్యం నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో ఆ ర్ ఓ అధికారి వద్ద ఏకగ్రీవ ఎన్నిక ధృవీకరణ పత్రాన్ని స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా మండ్యం నాగవేణి కి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధికి ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలందించాలని ఆకాంక్షించారు....

నెల్లూరులో మంజు రైస్ కంపెనీపై విజిలెన్స్ దాడి

- **రూ.42.30 లక్షల విలువైన 1,901 బస్తాల బియ్యం స్వాధీనం**
- **అనుమతులు లేకుండా హోల్‌సేల్, రిటైల్ వ్యాపారం..**
- **నిబంధనల ఉల్లంఘనపై అధికారుల చర్యలు**



నెల్లూరు జిల్లా బ్యూరో , నవంబర్ 27
(మనసులో మాట):

నెల్లూరు నగరంలో అక్రమంగా బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్న మంజు రైస్ & కంపెనీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.42.30 లక్షల విలువైన 1,901 బస్తాల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పెద్దబజార్, డైకస్ రోడ్డులో ఉన్న మంజు రైస్ & కంపెనీలో అధికారులు తనిఖీలు చేపట్టగా, జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) నుంచి తప్పనిసరిగా పొందాల్సిన రిజిస్ట్రేషన్ లేకుండానే హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు, అమ్మకాల బిల్లులు అందుబాటులో లేకపోవడంతో పాటు ఫుడ్ స్టాక్ పోర్టల్‌లోనూ నిల్వల వివరాలను నమోదు చేయలేదని గుర్తించారు. దీంతో అధికారులు పంచనామా నిర్వహించి వివిధ బ్రాండ్లకు చెందిన మొత్తం 555.24 క్వింటాళ్ల బరువున్న 1,901 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.42,30,674గా అధికారులు అంచనా వేశారు.

జాయింట్ కలెక్టర్ ఎదుట కేసు దాఖలు

ఈ వ్యవహారంపై నిత్యావసర వస్తువుల చట్టం 1955లోని సెక్షన్ 6(ఏ) ప్రకారం పౌర సరఫరాల శాఖ అధికారులు నెల్లూరు జాయింట్ కలెక్టర్ ఎదుట కేసు దాఖలు చేయనున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లాలోని రైస్ మిల్లర్లు, బియ్యం హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని అధికారులు హెచ్చరించారు. నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం ఎదుట ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహించడం, అక్రమంగా నిత్యావసర వస్తువులను నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ములకలచెరువు మండలంలో ముగ్గురు సర్పంచులు ఏకగ్రీవం





- **... సంబరాలు జరుపుకొన్న ప్రజలు**

ములకలచెరువు :27 నవంబర్
(మనసులో మాట)

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకలచెరువు మండలంలో శుక్రవారం మూడు పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవమయ్యారు. మండలంలో శుక్రవారం ఉపసంహరణలు జరగగా అందులో ములకలచెరువు సర్పంచ్ అభ్యర్థి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అగ్రహారం గౌస్ బాషా, పాత ములకలచెరువు సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి బోరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కోనేటివారి పల్లి గ్రామపంచాయతీ జనసేన పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మండెం నాగవేణిల దరఖాస్తులు ఒక్కొక్కటే కావడంతో వీరిని సర్పంచులుగా ఏకగ్రీవం చేస్తూ రిటర్నింగ్ అధికారి సర్పంచులుగా ఏకగ్రీవమైనట్లు ధ్రువపత్రాలను నూతన సర్పంచ్ అభ్యర్థులకు అందజేశారు. పాత ములకలచెరువు వార్డులు 10 వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా, ఉప సర్పంచ్ గా రాగిమానిపల్లికి చెందిన తొమ్మిదవ వార్డు సభ్యుడు పఠాన్ ముస్తఫా ఖాన్ ను పాతములకల చెరువు ఉప సర్పంచ్ గా వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో సర్పంచులుగా ఎంపికైన అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

సేవలు అభినందనీయం



కడప నవంబర్ 27
మనసులో మాట

కడప నగర ఊ క్కా యిపల్లిలో నిర్వహిస్తున్న దాదాస్ ఆధ్వర్యంలో డిస్టిక్ అడిక్షన్ సెంటర్ సేవలు అభినందనీయం అని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ షేక్ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మాసాపేట సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలో ఊక్కాయ పల్లిలో దాదాస్ సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు లోను ఆయన వారికి వృద్ధులకు మానసికంగా లోనైనా వారికి తమ వంతుగా సేవలు చేస్తున్న డాక్టర్ అంబేద్కర్ దళిత వర్గ అభివృద్ధి సంఘం (దా దాస్) సంస్థ అధినేత రవికుమార్ కు బాబా ఫక్రుద్దీన్ ఘనంగా సత్కరించడం జరిగింది.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

పాటూరు వారి కండ్రిగ సర్పంచిగా సుహాసిని



ముత్తుకూరు. నవంబర్.27 (మనసులో మాట)

మండలంలోని పాటూరు వారి కండ్రిగ సర్పంచ్ గా ఉమ్మడి అభ్యర్థి పాపారెడ్డి సుహాసిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ముత్తుకూరు స్వర్ణ గ్రామం కార్యాలయంలో ముత్తుకూరు, కృష్ణపట్నం, పాటూరు వారి కండ్రిగ నామినేషన్ల ప్రక్రియ ఈనెల 21 నుండి 23 వరకు జరిగింది సర్పంచ్ అభ్యర్థిగా ఒక్క నామినేషన్ మాత్రమే వచ్చింది. అలాగే నాలుగు వార్డులు ఉండగా ఒక్కొక్క దానికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో పాపారెడ్డి సుహాసిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించి ఆమెకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. అలాగే నాలుగు వార్డుల్లో కూడా ఏకగ్రీవంగా జరగడంతో ఈ పంచాయతీ సంబంధించి ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్టు అయింది. ఉపసర్పంచిగా మాచిరెడ్డి శార్వాణికి ఇవ్వనున్నట్లు తెలిసింది.

27వ వార్డు ప్రజా సమస్యలపై రోజువారి కార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన.. 27వ కౌన్సిలర్ పురుషోత్తం గౌడ్



ధర్మవరం నవంబర్ 27 (మనసులో మాట)

పట్టణం 27వ వార్డు సిద్ధయ్యగుట్ట, సాయి నగర్ లలో క్షేత్రస్థాయిలో పర్యటించి వార్డులో గల ప్రజా సమస్యలపై తక్షణం పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని 27వ వార్డు కౌన్సిలర్ పురుషోత్తం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వార్డులో సమస్యలను రోజు వారిగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తున్నామని, ప్రధానంగా 27వ వార్డులో త్రాగునీటి సమస్య,డ్రైనేజీ సింట్ సమస్య, చెత్త సేకరణ సమస్య ప్రధానంగా ఉన్నాయని ఈ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. వార్డును క్లీన్&గ్రీన్ గా తయారుచేసి త్రాగునీటి సమస్య లేని వార్డుగా చూడడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.

ప్రేమ పేరుతో ప్రాణాలు తీస్తున్న హింస

- - విభేదాలు హత్యలకు దారితీస్తున్న ఘటనలు
- - క్షణికావేశం.. కత్తులు, ఆయుధాలతో దాడులు
- - అనుమానాలు, బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు
- - యువతీ యువకులకు భద్రతపై కీలక సూచనలు



రాయలసీమ బ్యూరో,నవంబర్ 27 (మానుసులో మాట):

ప్రేమ, పరిచయం, సహజీవనం.. ఏ బంధమైనా పరస్పర నమ్మకం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛపై ఆధారపడి ఉండాలి. కానీ కొన్ని సందర్భాల్లో అనుమానాలు, ఆధిపత్య ధోరణి, పెళ్లి విషయంలో విభేదాలు, విడిపోవడానికి నిరాకరించడం వంటి కారణాలు తీవ్ర ఘర్షణలకు దారితీస్తున్నాయి. చివరకు అవి హత్యల వరకు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల బెంగళూరులో ఉద్యోగాల కోసం వచ్చిన ప్రేమజంటలో గంగా అనే యువతిని ఆమె ప్రియుడు కత్తితో పొడిచి చంపిన ఘటన ఈ ప్రమాదాన్ని మరోసారి గుర్తుచేసింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. 2026 అక్టోబరులో హైదరాబాద్‌లో పది రోజుల వ్యవధిలో హోటల్ గదుల్లో ముగ్గురు మహిళలు హత్యకు గురైన ఘటనలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటళ్లలో జంటలు బస చేసినప్పుడు ఒకరు మాత్రమే బయటకు వెళ్లడం, నకిలీ గుర్తింపు పత్రాలతో గదులు తీసుకోవడం వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని హోటల్ నిర్వాహకులకు పోలీసులు సూచించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఆగ్రా, ఇతర ప్రాంతాల్లోనూ వ్యక్తిగత సంబంధాల్లో తలెత్తిన వివాదాలు హత్యలకు దారితీసిన ఘటనలు నమోదయ్యాయి. అయితే ఇవన్నీ ఒకే రకమైన కారణాలతో జరిగినవని చెప్పలేం. ప్రేమ పేరుతో ఎవరికి మరొకరిపై అధికారం ఉండదు. ఫోన్ చూడాలని బలవంతం చేయడం, ఎవరితో మాట్లాడాలో నియంత్రించడం, తరచూ అనుమానించడం, బెదిరించడం, వెంటాడటం, డబ్బు లేదా వ్యక్తిగత విషయాలతో బ్లాక్‌మెయిల్ చేయడం వంటి ప్రవర్తనలను సాధారణ ప్రేమగా భావించకూడదు. బంధాన్ని కొనసాగించాలా వద్దా అనే నిర్ణయం ప్రతి ఒక్కరి వ్యక్తిగత హక్కు. విడిపోవాలని చెప్పినప్పుడు బెదిరింపులు, దాడులు, బలవంతపు కలయికకు ప్రయత్నాలు జరిగితే వాటిని తేలిగ్గా తీసుకోకూడదు. అలాంటి సంకేతాలు కనిపించిన వెంటనే నమ్మకమైన కుటుంబ సభ్యులు, స్నేహితులకు విషయం తెలియజేసి అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలి. ఉద్యోగాలు, చదువులు, ఇతర అవసరాల కోసం కొత్త నగరాలకు వెళ్లే యువతీ యువకులు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. కొత్తగా పరిచయమైన వ్యక్తులను పూర్తిగా తెలుసుకోకుండా వ్యక్తిగత వివరాలు, ఆర్థిక సమాచారం, గుర్తింపు పత్రాల ప్రతులు పంచుకోవద్దు. ఎవరినైనా కలవాల్సి వస్తే జనసంచారం ఉన్న బహిరంగ ప్రదేశాన్ని ఎంచుకోవాలి. ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారు అనే విషయాన్ని నమ్మకమైన వ్యక్తికి ముందుగానే తెలియజేయాలి. ప్రయాణానికి సొంత ఏర్పాట్లు ఉంచుకోవాలి. హోటల్ లేదా లాడ్జిలో బస చేసినప్పుడు గుర్తింపు పత్రాలు, గది వివరాలను కుటుంబ సభ్యులకు పంపడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే బయటకు వెళ్లే మార్గాన్ని తెలుసుకోవడం మంచిది. తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. ప్రేమ, స్నేహం, ఉద్యోగం, వ్యక్తిగత సంబంధాల విషయంలో సమస్యలు ఎదురైతే భయపడకుండా చెప్పగల వాతావరణం కల్పించాలి. యువతీ యువకులు కోపం, అనుమానం, తిరస్కరణను హింసతో పరిష్కరించాలనే ఆలోచనకు దూరంగా ఉండాలి. పరిస్థితి అదుపు తప్పుతున్నట్లు అనిపిస్తే అక్కడి నుంచి సురక్షితంగా బయటపడాలి. తక్షణ ప్రమాదం ఉంటే దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యవసర సహాయ నంబర్ 112కు కాల్ చేయాలి. హోటల్ నిర్వాహకులు కూడా గుర్తింపు పత్రాలను సరిచూసుకోవడం, అనుమానాస్పద పరిస్థితులను గమనించడం, హింస లేదా గొడవ జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి బాధ్యతలు నిర్వర్తించాలి. ప్రేమ అనేది ప్రాణాలను బలితీసుకునే హక్కు కాదు.. బంధం పేరుతో బెదిరింపులు, బలవంతం, హింసను సహించాల్సిన అవసరం ఎవరికీ లేదు. అప్రమత్తత, పరస్పర గౌరవం, సమయానికి సహాయం కోరడం ప్రాణాలను కాపాడగలవు.

అంతర్జాతీయ వేదికపై అమరావతిస్కూల్ కి అరుదైన గౌరవం..



పొదలకూరు, నవంబర్ 27 (మనసులో మాట):

విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక బోధనా పద్ధతులకు అంతర్జాతీయ వేదికగా నిలిచే డిఐడివిసి ఇండియా - 2026 విద్యా ప్రదర్శనలో అమరావతి ఈ.ఎం. స్కూల్, పొదలకూరుకు అరుదైన గౌరవం లభించింది.నవంబర్ 25 నుంచి 27 వరకు బెంగళూరులోని ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విద్యా ప్రదర్శనలో పాల్గొనేందుకు నెల్లూరు జిల్లా నుంచి ఎంపికైన కేవలం ఆరు పాఠశాలల్లో అమరావతి స్కూల్ ఒకటిగా నిలిచింది.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం పట్టణ, అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,అధునాతన కంప్యూటర్ విద్య, కోడింగ్, డిజిటల్ లెర్నింగ్ వంటి ఆధునిక విద్యా విధానాలను అందిస్తున్న అమరావతి స్కూల్ సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపునకు ఎంపిక చేయడం విశేషం.ఈ కార్యక్రమానికి అమరావతి విద్యాసంస్థల అధినేత కె. సురేష్ గారు హాజరై, అంతర్జాతీయ విద్యా రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాలు, ఆధునిక బోధనా విధానాలు, విద్యా ఆవిష్కరణలను పరిశీలించారు. భవిష్యత్తులో విద్యార్థులకు మరింత నాణ్యమైన, సాంకేతిక ఆధారిత విద్యను అందించేందుకు అవసరమైన అంశాలను తెలుసుకున్నారు.విద్యార్థులను కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా, భవిష్యత్తులో ఎదురయ్యే పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలనే లక్ష్యంతో అమరావతి స్కూల్ నిరంతరం నూతన విద్యా కార్యక్రమాలను అమలు చేస్తోంది. ముఖ్యంగా ఏఐ కబ్ కోడర్స్ లాబ్ , కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఒలింపియాడ్ శిక్షణ వంటి కార్యక్రమాలతో గ్రామీణ విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తోంది. నెల్లూరు జిల్లా నుంచి ఎంపికైన ఆరు పాఠశాలల్లో ఒకటిగా నిలవడం అమరావతి స్కూల్ విద్యా ప్రమాణాలకు, నూతన ఆలోచనలకు, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుపై పాఠశాలకున్న నిబద్ధతకు నిదర్శనమని యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందానికి, విశ్వాసంతో సహకరిస్తున్న తల్లిదండ్రులకు, విద్యార్థులకు, శ్రేయోభిలాషులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

దాసి కోటయ్య వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

- **200 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ.. అనంతరం ఘనంగా అన్నదానం**



గూడూరు, (మనసులో మాట)
నవంబర్ 27

కీర్తిశేషులు దాసి కోటయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు మణి మానవతా దృక్పథంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తండ్రి జ్ఞాపకాలను పదిలం చేసుకుంటూ, ఆయన ఆశయాలకు అనుగుణంగా పేదలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు.గూడూరు నియోజకవర్గంలోని సంగం థియేటర్ సెంటర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది నిరుపేదలకు చలి నుంచి రక్షణ కల్పించేందుకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి దుప్పట్లు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. దుప్పట్ల పంపిణీ అనంతరం అక్కడికి విచ్చేసిన పేద ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ఈ సేవా కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, ముమ్మడి వెంకటేశ్వర్లు, చిల్లకూరు మండల నాయకులు యనమల దినేష్‌కుమార్, దాసరి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దాసి కోటయ్య గారి వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూతనివ్వడం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని పేర్కొన్నారు.తండ్రి జ్ఞాపకార్థం తన కుమారుడు మణి ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. తల్లిదండ్రుల జ్ఞాపకాలను కేవలం మాటల్లోనే కాకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో కొనసాగించడం ఆదర్శనీయమని తెలిపారు.పేదలకు సేవ చేయడమే దాసి కోటయ్య గారికి అందించే నిజమైన నివాళి అని, ఆయన కుమారుడు మణి ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు ఆకాంక్షించారు.దాసి కోటయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకున్నాయి. మానవత్వం, సేవాభావం చాటిన ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది.

అధికార పూర్వకంగా సర్పంచ్, ఉప సర్పంచ్ల జాబితాను విడుదల .. ఎంపీడీవో వెంకటేష్



ధర్మవరం నవంబర్ 27
(మనసులో మాట)

మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ఎన్నికలలో ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు సజావుగా నిర్వహించడం జరిగింది. ఈ సర్పంచుల, ఉప సర్పంచుల జాబితా విడుదల చేయడానికి శుక్రవారం తెల్లవారుజామున వరకు ఉద్యోగస్తులు తమ విధులను నిర్వర్తించారు. తదుపరి ఎంపీడీవో వెంకటేష్ సర్పంచు, ఉప సర్పంచుల జాబితాను అధికార పూర్వకంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మారం మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీలలో జాబితాను విడుదల చేయడం జరిగిందని, ఇందులో పోతుకుంట గ్రామ పంచాయతీలో సర్పంచ్ గా తలారి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గా జి. ఈశ్వరమ్మ, మల్లా కాలువ లో సర్పంచుగా కందేరి ఆదినారాయణ, ఉప సర్పంచ్ గా ఇంక ను ప్రకటించలేదు, కునుతురులో సర్పంచుగా అనిత, ఉప సర్పంచ్ గా ప్రకటించలేదు, సుబ్బారావు పేటలో టీ. చిన్న గంగప్ప, ఉప సర్పంచ్ గా తలారి హేమ తేజ, తుమ్మల గ్రామపంచాయతీలో సర్పంచ్గా ప్యాదిండి వెంకట రమణమ్మ, ఉప సర్పంచ్గాసి. వినోద్ కుమార్ రెడ్డి, మల్కాపురంలో సర్పంచ్ గా మిడతల శివానంద, ఉప సర్పంచ్ గా జి .ఆనంద్, నేలకోటలో సర్పంచ్ గా బి లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గా యు. విజయలక్ష్మి., చికిచెర్ల లో సర్పంచ్ గా పెద్దిరెడ్డి గారి హంస వేణి, ఉప సర్పంచ్ గా షేక్ రామకృష్ణ, ఉప్పులేసనపల్లిలో సర్పంచుగా ఎన్ మధురవాణి, ఉప సర్పంచ్ గా ఎస్ కోమల, చింతలపల్లి లో సర్పంచ్ గా పి సౌభాగ్య, ఉప సర్పంచ్ గా జి నాగేంద్రప్రసాద్, రేగాటిపల్లి లో సర్పంచ్ గా చిన్న వారాధమ్మ, ఉప సర్పంచ్ గా వల్లి వెళ్లి జ్యోతి, పోతుల నాగేపల్లి లో సర్పంచ్ గా డి బాబయ్య, ఉప సర్పంచ్ గా జి. శ్యామలమ్మ, ఏలుకుంట్లలో సర్పంచ్ గా ఏ వెంకటరమణ, ఉప సర్పంచ్ గా టి శ్యామలమ్మ, రాహుల్ చెరువులో బిల్లే పెద్దయ్య, ఉప సర్పంచ్ గా ఎన్నిక లేదు, గొట్లూరు లో ఎన్ మారుతి కుమార్, ఉప సర్పంచ్ గా ఎన్నిక లేదు, సీసీ కొత్తకోటలో సర్పంచ్ గా జ్యోతి రాజేశ్వరి, ఉప సర్పంచ్ గా ధలవాయి గౌతమి, దర్శనమల లో సర్పంచుగా ముక్కర ఓబులేష్, ఉప సర్పంచ్ గా ఎం నారాయణస్వామి, నేలకోట తండాలో సర్పంచుగా శాంతి భాయ్, ఉప సర్పంచ్ గా రమేష్ నాయక్, ధర్మపురిలో సర్పంచ్ గా జి. విజయ్ కుమార్, ఉప సర్పంచ్ గా దేవరకొండ విష్ణు, వెంకట తిమ్మాపురం లో సర్పంచ్ గా సాకే బాలమ్మ, ఉప సర్పంచ్ గా డి సుగుణ కలరు అని తెలిపారు. వీరందరికీ డిక్లరేషన్ ఫారం కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. తదుపరి ఎన్నికైన అభ్యర్థులకు ఎంపీడీవో తో పాటు ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలం



బద్వేలు, మనసులో మాట,
నవంబర్ 27:

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత శుభ్రత పాటిస్తే జబ్బులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం మాధవరం ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని బ్రా హ్మనపల్లిగ్రామంలో స్థానిక వైద్య అధికారిని డాక్టర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే ఫ్రైడే పాటించాలని గ్రామ ప్రజలకు తిలియజేసారు.పి హెచ్ ఎన్ కళావతి మాట్లాడుతూ దోమల వల్ల టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వస్తాయని, దోమ పుట్టకూడదు పుట్టినదోమ కుట్టకూడదు అన్నారు. అలాగె మండల్ సూపెర్వైసర్ డి రమణయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలందరు పరిసరాల పరిశుభ్రత మరియు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలనితె లియపరిచారు. ఈకార్యక్రమంలో జి యశోద ఎంపీహెచ్ఏ ఎఫ్ ఆశ సారమ్మ, గ్రామప్రజలు తదితరులు పాలుకొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ భూమిరెడ్డి వెంకటేశ్వర్లుకు టీడీపీ నాయకుల పరామర్శ



బద్వేలు, మనసులో మాట,
నవంబర్ 27:

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలపాలై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బద్వేల్ సీనియర్ జర్నలిస్టు భూమిరెడ్డి వెంకటేశ్వర్లును టీడీపీ నాయకులు పరామర్శించారు. గురువారం ఆయన నివాసానికి చేరుకున్న నాయకులు వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీసి, ఆయనకు ధైర్యం చెప్పారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మాజీ మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ ప్రసాద్, 11వ వార్డు కౌన్సిలర్ పీఆర్పీ వెంకటసుబ్బయ్య, 10వ వార్డు టీడీపీ ఇంచార్జ్ మస్తాన్ బాబు, 18వ వార్డు టీడీపీ ఇంచార్జ్ లకిడి విజయ్, నాయకులు ప్రశాంత్, శివ సాయి ఈవెంట్స్ నిర్వాహకులు శివ సాయితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

అభివృద్ధికి పట్టం కట్టిన కావలి ఓటర్లు..



- **కావలి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్ దిశగా అడుగులు..!**

కావలి, నవంబర్ 27 (మనసులో మాట):

నిన్న ప్రశాంతంగా ముగిసిన కావలి పట్టణ ఎన్నికల్లో ఓటర్లు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని స్థానిక నాయకులు విశ్లేషిస్తున్నారు. పోలింగ్ సరళిని బట్టి చూస్తే, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి భరత్ గారి విజయం నల్లేరు మీద నడకేనని కూటమి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాకుండా, పట్టణంలోని 39+ వార్డుల్లో కౌన్సిలర్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొంది, కావలి పీఠాన్ని కైవసం చేసుకోబోతున్నారని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అభివృద్ధి మార్క్..కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై నమ్మకంతో ఓటు వేసిన కావలి పట్టణ ప్రజలు.

చింతల చెరువు పంచాయతీ ప్రజలకు సేవకులుగా పనిచేస్తాం



- **- నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి దంపతులు**

బద్వేలు, మనసులో మాట, నవంబర్ 27:

ఒక పదవి దక్కడం అంటే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడం గొప్ప గౌరవం. చింతల చెరువు పంచాయతీ సర్పంచ్ గా ప్రజలు ఇంత గొప్ప మెజారిటీ తో గెలిపించడం మా జీవితంలో మరిచిపోలేని ఒక ఆనందం.ఈ అరుదైన గౌరవాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ సదా రుణపడి ఉంటాము.మా విజయానికి మార్గదర్శకత్వం వహించి, వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరు, పేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ప్రజల ఆశీస్సులు,పెద్దల ప్రోత్సాహం, నాయకులు, కార్యకర్తల సహకారం మాకు కొండంత బలాన్ని ఇచ్చాయి.ఈ విజయం ఒక వ్యక్తికి దక్కిన గౌరవం కాదు. గ్రామ ప్రజల ఐకమత్యానికి లభించిన గుర్తింపు. మీరు మా పై ఉంచిన విశ్వాసాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించడమే మా సంకల్పం. గ్రామ ప్రగతికి, ప్రజల ఆకాంక్షల సాధనకు నిరంతరం శ్రమిస్తామని మాట ఇస్తున్నాము.మీ నమ్మకమే మా నడకకు బలం, చింతలచెరువు పంచాయతీ అభ్యున్నతే మా అంతిమ లక్ష్యం.

బాలాజీ నగర్, యాదవ్ వీధి లో కూటమి సర్పంచ్ అభ్యర్థి కాసా శ్రీనివాసులు ప్రచారం

- **పొదలకూరులో కూటమికి పెరుగుతున్న మద్దతు**
- **కత్తెర గుర్తుకు ఓటెయ్యండి- అత్యధిక మెజార్టీతో గెలిపించండి.**



పొదలకూరు, నవంబర్ 27 (మనసులో మాట):

పొదలకూరు గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి సర్పంచ్ అభ్యర్థి కాసా శ్రీనివాసులు బాలాజీ నగర్, యాదవ్ వీధి లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రతి ఒక్కరినీ కలుసుకున్న ఆయన, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తనకు కేటాయించిన కత్తెర గుర్తుకు ఓటేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పొదలకూరు అభివృద్ధికి, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్, యాదవ్ వీధి ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి, తమ మద్దతు తెలిపారు. పొదలకూరులో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కాసా శ్రీనివాసులు ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బి. మల్లికార్జున్ నాయుడు, ఊకోటి లక్ష్మీనారాయణ, కోపూరు వెంకటేశ్వర్లు నాయుడు, ఎస్కే జమీర్ భాష, దర్శి విజయబాబు, ఖాదర్ భాషా, సుగుణమ్మ ,మురళి, టిడిపి నాయకులు,బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యుల అభ్యర్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో వాయుగుండం..

- **- ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక**
- **- నవంబర్ 30 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం**
- **- డిసెంబర్ 2 నాటికి వాయుగుండంగా బలపడే సూచనలు**
- **- తమిళనాడు లేదా శ్రీలంక తీరాల వైపు పయనం**
- **- సముద్రంలోనే బలహీనపడే అవకాశమున్నట్లు అంచనా**



రాయలసీమ బ్యూరో,నవంబర్ 27 (మనసులో మాట):

బంగాళాఖాతంలో మరో వాతావరణ వ్యవస్థ ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. దక్షిణ అండమాన్ సముద్రంపై ఏర్పడే ఉపరితల ఆవర్తన ప్రభావంతో నవంబర్ 30వ తేదీ నాటికి అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ వాతావరణ వ్యవస్థ క్రమంగా బలపడే అవకాశాలపై వాతావరణ శాఖలు పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి. అల్పపీడనం ఏర్పడిన అనంతరం డిసెంబర్ 2వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఏపీఎన్‌డీఎంఏ తెలిపింది. సముద్ర ఉపరితల పరిస్థితులు, గాలుల దిశ, వాతావరణ అనుకూలత ఆధారంగా దీని తీవ్రతలో మార్పులు చోటుచేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వ్యవస్థ కదలికలు, బలపడే పరిస్థితులపై నిశితంగా పరిశీలన జరుగుతోంది. వాయుగుండం ఏర్పడితే అది పశ్చిమవాయవ్య దిశగా కదులుతూ తమిళనాడు లేదా శ్రీలంక తీరాల వైపు వెళ్లే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. అయితే దీని ప్రయాణ దిశ, తీరానికి చేరువయ్యే సమయం, తీవ్రతపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. తదుపరి వాతావరణ అంచనాల ఆధారంగా ఈ వివరాల్లో మార్పులు ఉండవచ్చని తెలుస్తోంది. వివిధ వాతావరణ నమూనాల విశ్లేషణ ప్రకారం ఈ వాయుగుండం సముద్రంలోనే బలహీనపడే సూచనలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. అందువల్ల ప్రస్తుతం తీర ప్రాంతాలపై ప్రభావం ఎలా ఉండబోతుందనే విషయంలో తొందరపడి నిర్ణయానికి రావాల్సిన అవసరం లేదని వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనించాల్సి ఉంది. అల్పపీడనం ఏర్పడిన తర్వాత దాని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వాతావరణ వ్యవస్థకు సంబంధించిన తాజా సమాచారాన్ని ప్రజలు అధికారిక ప్రకటనల ద్వారా తెలుసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచిస్తోంది. ముఖ్యంగా మత్స్యకారులు సముద్ర పరిస్థితులు, వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అధికారులు జారీ చేసే సూచనలను పాటించాలి. తీర ప్రాంత ప్రజలు కూడా వర్షాలు, బలమైన గాలులకు సంబంధించిన తాజా హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలి. రాబోయే రోజుల్లో ఈ వాతావరణ వ్యవస్థ ఎలాంటి మార్పులకు లోనవుతుందనే దానిపై అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రాష్ట్రంలో కొనసాగుతున్న హిందూ ఆలయాల విధ్వంసకాండ

- కూటమి ప్రభుత్వ పాలనలో హిందూ ఆలయాలకు రక్షణ కరువు
- వైసిపి నాయకులు భూమన కరుణాకర్ రెడ్డి



తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

రాష్ట్రంలో హిందూ ఆలయాల విధ్వంసం కొనసాగుతోందని, రేణిగుంట మండలం ఆంజనేయ పురం అభయాంజనేయ స్వామి ఆలయం ధ్వజస్తంభం ధ్వంసం చేయడంపై వైయస్ఆర్సీపీ రీజినల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అతి పురాతన ఆలయం తొలగింపు తో పాటు ధ్వజస్తంభాన్ని ధ్వంసం చేసి చెత్తకుప్పలో పడేయటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, ఈ చర్య కోట్లాదిమంది హిందువుల భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అభయ ఆంజనేయ స్వామిని కూల్చివేసి హిందువులమనస్సులను గాయపరిచారు, అభయ ఆంజనేయ స్వామి ఆలయం స్వయంభూ కాదు అంటూ దేవాదాయ శాఖ మంత్రి తో అసత్య ప్రచారం చేస్తూ, మాట్లాడించారు. 70 ఏళ్ల నాటి ఆలయం అంటూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. 160 ఏళ్ళక్రితం బ్రిటిష్ కాలంలో ఆంజనేయపురం రైల్వే స్టేషన్ ఎలా వచ్చింది. వాస్తవాలు మేము వీడియోలు ద్వారా బహిర్గతం చేశాం, కూల్చలేదు అంటూ అవాస్తవాలు చెప్తున్నారు. ధ్వజస్తంభం కూల్చివేసి చెత్త దిబ్బల్లో పడేశారని విమర్శించారు. ధ్వజస్తంభం అంటే దైవ సమానం కు గుర్తు గా పూజిస్తారు, ప్రత్యేకఉత్సవాలు జరిగినప్పుడు పతకాలు ధ్వజ స్తంభంకు ఎగుర వేస్తారు. ధ్వజస్థంభం పరిరక్షిస్తామని చెప్పి, ధ్వజస్తంభం 27 తేదీ కూల్చి వేశారు, చెత్త కుప్పలో పడేశారు. వాసరాలు సైతం గుడి కూల్చివేతను చూసి సోకిస్తున్నాయి అని తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ మోడీకి విజ్ఞప్తి చేస్తున్నా.. శ్రీరాముడు కు పరమభక్తుడు ఆంజనేయస్వామి, ఆంజనేయస్వామి ఆలయానికి రక్షణ లేదు. విగ్రహం ధ్వంసం చేశారు, పగలగొట్టారు, ఆలయం ధ్వంసం చేశారని తెలిపారు. హిందూ ఆలయాలను సంప్రదాయాలను ధ్వంసం చేయాలని కూటమి నాయకులు చూస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వం పతనానికి నాంది అవుతుంది. కూటమి ప్రభుత్వం లో హిందూ ఆలయాలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు.

ఉదయగిరిలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా కాకర్ల సురేశ్ ప్రచారం

- - సర్పంచ్ అభ్యర్థి షేక్ రియాజ్‌కు మద్దతుగా పర్యటన
- - వార్డు సభ్యుల అభ్యర్థుల తరపున కూడా ప్రచారం
- - గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై ప్రస్తావన
- - స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి





ఉదయగిరి, నవంబర్ 27 (మనుసులో మాట):

స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉదయగిరి పట్టణంలో కూటమి బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా కాకర్ల సురేశ్ ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి సర్పంచ్ అభ్యర్థి షేక్ రియాజ్‌తో పాటు వార్డు సభ్యుల అభ్యర్థుల తరపున ప్రజలను కలిశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల గురించి వివరిస్తూ, వారికి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు.ఉదయగిరి పట్టణంలో స్థానిక ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించినట్లు కాకర్ల సురేశ్ తన ప్రకటనలో వెల్లడించారు. కూటమి తరఫున బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి షేక్ రియాజ్‌తో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు కూడా మద్దతు ప్రకటిస్తూ, వారి ఎన్నికల గుర్తులను ప్రజలకు వివరించారు. స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలను కాకర్ల సురేశ్ ప్రస్తావించారు. గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి స్థానిక సంస్థల పాత్ర కీలకమని పేర్కొంటూ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని తన ప్రచారంలో వివరించారు. ఉదయగిరి పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాల అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముఖ్యమైనవని పేర్కొంటూ తన అభిప్రాయాలను ప్రజల ముందు ఉంచారు. స్థానిక పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా షేక్ రియాజ్‌తో పాటు వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన కాకర్ల సురేశ్.. ఓటర్లను కలిసి అభ్యర్థుల ఎన్నికల గుర్తులను వివరించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారం అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ తన ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు.

పొదలకూరు లో అభివృద్ధి శూన్యం: కాకాణి పూజిత



పొదలకూరు, నవంబర్ 27(మనసులో మాట):

పొదలకూరు గ్రామపంచాయతీలో శుక్రవారం వై ఎస్ ఆర్ సి పి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.సర్పంచ్ అభ్యర్థి కోనం బ్రహ్మయ్య తో పాటు 18 మంది వార్డు సభ్యుల అభ్యర్థులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తూ,వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.సర్పంచ్ అభ్యర్థి కూనం బ్రహ్మయ్య కి ఉంగరం గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి గడపలోను కాకాణి పూజితమ్మకు అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు.స్థానిక ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన కాకాణి పూజితమ్మ. సర్పంచ్,వార్డు అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన పూజితమ్మ . ఈ సందర్భంగా కాకాణి పూజిత మాట్లాడుతూ. పొదలకూరు గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, కనీసం చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం, స్థానిక నాయకులు ఉన్నారని కాకాణి పూజిత గారు విమర్శించారు.పొదలకూరు గ్రామంలో కనీసం ఒక్క ఇటుక కూడా పేర్చిన పరిస్థితి లేదని, గతంలో ప్రారంభమై అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు నేటికీ ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయడం వంటి చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకపోతున్నారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక నాయకులు, కార్యకర్తలు చొరవ చూపితే నిమిషాల్లో పరిష్కరించగలిగే సమస్యలని పేర్కొన్నారు.తాము అధికారంలో ఉన్న సమయంలో నాయకులు, అధికారులు ఎంతో చురుగ్గా పనిచేసేవారని,ప్రజల సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా గనుల తవ్వకాలు,గ్రావెల్,ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, కూటమి నాయకులు ప్రజల సహజ వనరులను వినియోగించుకుంటున్నారే తప్ప ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు మాత్రం చేయడం లేదని మండిపడ్డారు.తన తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి మరెవరి హయాంలోనూ జరగలేదని గర్వంగా చెప్పగలనన్నారు. క్రీస్తుపూర్వం, క్రీస్తుశకం అన్నట్లుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత అని సర్వేపల్లి అభివృద్ధిని పోల్చి చెప్పుకోవచ్చని, అంత వేగంగా అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు.ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను చూస్తుంటే బాధ కలుగుతోందని, బ్రహ్మయ్య గెలిచిన వెంటనే చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇప్పటికే చర్చించామని తెలిపారు. వైఎస్సార్సీపీ అంటే కేవలం ఎన్నికల్లో గెలిచి సంబరాలు చేసుకునే పార్టీ కాదని, గెలిచిన వెంటనే ప్రజలకు ఏం చేయాలి, వారి సమస్యలను ఎలా పరిష్కరించాలి అని ఆలోచించే పార్టీ అని అన్నారు. ప్రజల కష్టాలను నిరంతరం ఆలోచించే నాయకులు, కార్యకర్తలు తమతో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు.పొదలకూరు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించాలంటే వైఎస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ అభ్యర్థి కూనం బ్రహ్మయ్య తో పాటు పోటీలో ఉన్న 18 మంది వార్డు సభ్యుల అభ్యర్థులందరికీ ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కాకాణి పూజిత ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో పొదలకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వాకాటి శ్రీనివాస రెడ్డి, సోమా భాస్కర్, కార్యకర్తలు, వార్డుకు పోటీ చేసిన అభ్యర్థులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. ఎదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు



- **ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణే లక్ష్యం**
- **సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా**
- **డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**

తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

తిరుపతి జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.

ఎన్నికలు జరిగే గ్రామాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా ప్రత్యేక పోలీసు బృందాలను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడే అవకాశం ఉన్నవారి కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా గుంపులుగా గుమికూడరాదని సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రాల నుంచి వెళ్లిపోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, ఓటర్లను భయపెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి నిష్పక్షపాతంతో, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు, ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ప్రజలందరూ తిరుపతి జిల్లా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

ఎస్వీ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఎస్. వెంకటరమణారెడ్డి నియామకం

తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీ యూనివర్సిటీ) భౌతిక శాస్త్ర విభాగం నూతన విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఎస్. వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. భూపతి నాయుడు ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ప్రొఫెసర్ ఎస్. వెంకట రమణారెడ్డి రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



ఎర్రచందనం అక్రమ రవాణాపై అటవీ శాఖ ఉక్కు పాదం

- **114 దుంగలు స్వాధీనం ఏడు వాహనాలు సీజ్**
- **కడప జిల్లా అటవీ శాఖ అధికారి కె. బాలరాజు**

కడప, నవంబర్ 27 (మనసులో మాట):

జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నట్లు కడప జిల్లా అటవీ శాఖ అధికారి కె. బాలరాజు శుక్రవారం కడప డివిఫ్ఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో వెల్లడించారు. తన పర్యవేక్షణలో అటవీ అధికారులు, రేంజ్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చేపట్టిన దాడుల్లో 2,226.75 కిలోల బరువున్న 114 ఎర్రచందనం దుంగలను, ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ అక్రమ రవాణాలో ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మొబైల్ ఐసీయూ అంబులెన్స్‌ను ఉపయోగించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ కేసులో తెలుగు రాష్ట్రాలకు చెందిన పెరుగు లక్ష్మీ నరసయ్య, బత్తల భక్తుడుతో పాటు తమిళనాడుకు చెందిన రామలింగం, పెరియప్పలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో మొబైల్ ఐసీయూ అంబులెన్స్, రెండు ఆటోలు, రెండు టయోటా ఇన్నోవా కార్లు, మారుతి సుజుకి డిజైర్ కారు, ఒక హీరో గ్లామర్ ద్విచక్ర వాహనం ఉన్నాయని తెలిపారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని, పరారీలో ఉన్న మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎఫ్ఓ కె. బాలరాజు వెల్లడించారు.





మహిమాన్విత క్షేత్రం రుద్రపాదాల ముక్కోటి

- **చాలా రోజుల కిందట ఆలయాన్ని సందర్శించా**
- **ప్రస్తుతం బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారు...**
- **ఆలయాన్ని దర్శించి వృద్ధిలోకి తెండి...**
- **బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అమృత సందేశం....**

తిరుపతి బ్యూరో, నవంబర్ 27 (మనసులో మాట) :

శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం సన్నిధిలో శుక్రవారం రాత్రి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు నిర్వహించిన ప్రవచన కార్యక్రమం అత్యంత వైభవ పూర్వకంగా జరిగింది. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం తొండవాడ వద్ద స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామి మహా క్షేత్ర వైశిష్ట్యం, అగస్త్యమహర్షి ఆధ్యాత్మిక వైభవం, హరిహరుల అభేదతత్వం గురించి చాగంటి కోటేశ్వర రావు అద్భుతంగా వివరించారు. రుద్రపాదాల ముక్కోటి క్షేత్రంగా ప్రాచుర్యం పొందిన శ్రీఅగస్త్యేశ్వర స్వామి క్షేత్ర మహిమా తత్వాన్ని తెలుసుకునే అవకాశం లభించడంతో భక్తులు ఆధ్యాత్మిక అనుభూతికి లోనయ్యారు. అగస్త్య మహాముని ఎక్కడ ఉంటే అక్కడికే ముక్కోటి దేవతలు విచ్చేసి ఉపాసన చేస్తారంటూ ఈ ఆలయం అంత పవిత్రమైనదని భక్తులకు ఉపదేశం చేశారు. దీంతో శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తే అష్టైశ్వర్యాలు లభిస్తాయన్న ప్రగాఢ విశ్వాసం ఉండగా.... చాగంటి కోటేశ్వరరావు ప్రవచనంతో ముక్కోటి క్షేత్ర ప్రాశస్త్యం భక్తులకు మరింత చేరువైంది. గతంలో తాను ముక్కోటి క్షేత్రాన్ని అనేక సార్లు సందర్శించానని, నాటితో పోల్చితే ప్రస్తుతం ఆలయాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారని ఆలయ ధర్మకర్తల మండలిని ప్రశంసించారు. ధర్మబద్ధమైన జీవితాన్ని గడపాలన్న ఆధ్యాత్మిక సందేశాలను భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తూ చాగంటి ప్రవచనం ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ముక్కోటి క్షేత్రం పులకించింది. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రవచనకార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు మునుపు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మొగిలి ఇందుమౌళి రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీఅగస్త్యేస్వర స్వామి, శ్రీ ఆనందవల్లీ దేవి అమ్మవార్లను, శ్రీహరిహరాదుల దివ్య మండపాన్ని, శ్రీవేంకటేశ్వర స్వామి వారి పాద ముద్రను తన జీవిత భాగస్వామితో కలిసి దర్శించుకున్నారు.



